'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 23 | సోమవారం | 7.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 23 | Monday | 7.9.2026 | Pages: 8 | Rate: 2



## మినిస్టర్ ఆది శ్రీనివాస్..!?

- 5లో...

### కొండా సురేఖ స్థానంలో జాక్ పాట్

### విస్తరణలో పాతకాపుకు గోల్డెన్ ఛాన్స్!

రాజకీయాల్లో అదృష్టం ఎప్పుడు ఎవరిని తలుపుతడు తుందో చెప్పడం కష్టం. పదవి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసిన నేతకు ఒక్కసారిగా మారిన సమీకరణాలు గోల్డెన్ ఛాన్స్ తెచ్చిపెడతాయి. ఇప్పుడు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేరు తెలంగాణ కాంగ్రెస్‌లో ఇదే కోణం లో చర్చకు వస్తోంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆయనకు 2023లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపు కీలక మలుపైంది. ఆ తర్వాత ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టి పార్టీలో తన ప్రాధాన్యత పెంచుకున్నారు. తాజాగా కొండా సురేఖ చుట్టూ నెలకొన్న పరిణామాల నేపథ్యంలో మంత్రివర్గంలో ఖాళీ ఏర్పడితే, ఆ స్థానానికి ఆది శ్రీనివాస్ ను పరిశీలించే అవకాశం ఉందన్న ప్రచారం ఊపందు కుంది. మున్నూరు కాపు సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం, సీనియారిటీ, ఎమ్మెల్యేగా గెలుపు, ప్రభుత్వ విప్‌గా అనుభ వం ఆయనకు అనుకూలంగా మారవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే తుది నిర్ణయం మాత్రం సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం చేతుల్లోనే ఉంది.

## 2029 పీఎం రేసులో రాహుల్

- 3లో...

### విపక్ష కూటమి ప్రధాని ఆయనే

### తమిళనాడు పీసీసీ చీఫ్ స్పష్టీకరణ




## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- 2లో...

నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు ఉభయ సభలు కొలువుదీరగా, ప్రశ్నోత్తరాలతో కార్యకలాపాలు మొదలవుతాయి. సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సభలో కీలక నివేదికలు, పలు బిల్లులు, ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం ఉంది. తెలంగాణ సమగ్ర శిక్ష 2024-25, పీఎం శ్రీ 2024-25 ఆడిట్ నివేదికలతో పాటు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు సంబంధించిన ఐదు వార్షిక నివేదికలను ప్రభుత్వం సభ ముందుకు తీసుకురానుంది. రైతులు, ఉద్యోగులు, సాగునీరు, ప్రభుత్వ పథకాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వం కూడా విపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు వ్యూహం సిద్ధం చేసుకుంది. దీంతో ఈసారి సమావేశాలు వాడీవేడిగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సభలోపల, బయట ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. సభ్యులు కోరిన సమాచారాన్ని త్వరగా అందించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శాఖల అధికారులు సమావేశాల సమయంలో అందుబాటులో ఉండాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. సభ్యులకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో అవసరమైన సమాచారాన్ని ముందుగానే అందించాలని ఆదేశించారు. ధర్నాలు, రాస్తారోకోలకు అవకాశం లేకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో అసెంబ్లీ సమావేశాలు తెలంగాణ రాజకీయాల్లో వేడి పెంచేలా సాగనున్నాయి.

## హైదరాబాదీలకు గుడ్ న్యూస్

### మెట్రో-ఆర్టీసీ జాయింట్ పాస్

హైదరాబాద్ నగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం కీలక సౌకర్యం అందించేందుకు సిద్ధమవుతోంది. మెట్రో రైల్, టీజీఎస్ఆర్టీసీ బస్సులకు ఒకే జాయింట్ పాస్ తీసుకొచ్చే దిశగా చర్యలు వేగం పుంజుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదివారం హైదరాబాద్ మెట్రో రైల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై ఈ అంశంపై సమీక్షించారు. ప్రయాణి కుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని రోజు వారీ, నెలవారీ జాయింట్ పాస్‌లు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు.




## ఇండియా మా కోసం చమురు కొనడం లేదు

### భారత్ ప్రయోజనాల కోసమేనన్న రాయబారి

### రష్యా చమురుపై తుది నిర్ణయం కేంద్రానిదే

### తేల్చి చెప్పిన రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్



రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం మాస్కోకు సాయం చేసేందుకు కాదని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. దేశ ఇంధన భద్రత, ప్రజల సంక్షేమం, జాతీయ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే భారత్ రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ దేశాల నుంచి ఆంక్షలు, అదనపు సుంకాల ఒత్తిడి పెరుగుతున్న సమయంలో అలిపోవ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. భారత్ తన జాతీయ ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గకుండా నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన అన్నారు. భారత్‌కు అవసరమైనంత చమురును సరఫరా చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందని తెలిపారు.




ఒకప్పుడు కూరలో రుచికి తప్పనిసరిగా వేసే ఉల్లి.. ఇప్పుడు వంటింటి బడ్జెట్‌ను కాల్చేస్తున్న ఖరీదైన వస్తువుగా మారింది. కిలో రూ.60 దాటింది.. కొన్ని చోట్ల రూ.100కు చేరువైంది. మరి ఇదే సమయంలో రైతు పరిస్థితి ఏంటి? పొలంలో పండించిన ఉల్లికి గిట్టుబాటు ధర రాక కన్నీళ్లు పెట్టుకునే రైతు.. మార్కెట్‌కు వచ్చేసరికి అదే ఉల్లి ధర ఎందుకు ఆకాశాన్నంటుతోంది? దేశంలో అవసరానికి మించి ఉల్లి ఉత్పత్తి అవుతోందని లెక్కలు చెబుతున్నా వినియోగదారుడి చేతికి చేరేసరికి ధర ఎందుకు మండిపోతోంది? రైతు తక్కువకు అమ్ముతున్నాడు.. సామాన్యుడు ఎక్కువకు కొంటున్నాడు.. మధ్యలో ఎవరి జేబులుని నిండుతున్నాయి? కేంద్రం సబ్సిడీ ఉల్లిని కిలో రూ.35కే విక్రయిస్తున్నా మార్కెట్ ధరలు ఎందుకు అదుపులోకి రావడం లేదు? నిల్వలు ఎక్కడ ఆగిపోతున్నాయి? సరఫరా గొలుసులో ఏం జరుగుతోంది? రైతు పండించిన పంటకు సరైన ధర దక్కకుండా, వినియోగదారుడిపై మాత్రం రెట్టింపు భారం పడే ఈ వ్యవస్థకు బాధ్యులు ఎవరు? ఉల్లి ధర పెరిగితే సామాన్యుడి వంటింట్లో మంట.. ధర పడిపోతే రైతు ఇంట్లో కన్నీరు. ఈ ధరల ఆట ఎప్పటివరకు?

- 7లో...



## కాంగ్రెస్ పాలన అట్టర్ ఫ్లాప్

### ఎర్రవల్లి బీఆర్ఎస్ఎల్పీలో కేసీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిగా విఫల మైందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర విమర్శ లు చేశారు. కాంగ్రెస్ పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అంటూ మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశానికి కేటీఆర్, హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.



### రేవంత్ కు కేసీఆర్ సవాల్

తిట్టించుకునేందుకు రావాలి

అసెంబ్లీ హాజరుపై ఫుల్ క్లారిటీ

### అసెంబ్లీ తర్వాత కేసీఆర్ రణం

జలాల కోసం ప్రత్యక్ష పోరాటం.. కార్యాచరణ వెల్లడించిన హరీశ్





## కేసీఆర్ అసెంబ్లీకి రావాలి

వెయ్యి రోజులుగా దూరం.. మంత్రి శ్రీధర్‌బాబు ఫైర్

- 3లో...

## గ్రామ నిధులు నేరుగా సర్పంచ్‌లకే త్వరలో కొత్త బిల్లు: మంత్రి సీతక్క

## హైదరాబాద్‌లో కోడిపందేలు

స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

- 3లో...



- 2లో...

### కాంగ్రెస్‌లో క్రమశిక్షణ షోకాజ్ నోటీసుల కలకలం

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ కాంగ్రెస్‌కు నష్టం కలిగించేలా వ్యవహరించారన్న ఆరోపణలపై పలువురు నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆదిలాబాద్ ఇన్‌ఛార్జ్ కంది శ్రీనివాస్, సం జీవరెడ్డి, జూపల్లి మల్లారెడ్డి, గజ్వేల్ నర్సారెడ్డి కి నోటీసులు ఇచ్చినట్లు కమిటీ ఛైర్మన్ మల్లు రవి తెలిపారు.

### తెలంగాణలో ఈవీ ఛార్జింగ్ దూకుడు

- 2లో...

## ప్రపంచ పటంలో భారత్ అసలు సైజు ఇదే!

మెర్కేటర్ మ్యాప్‌తో మారిన ప్రపంచ చిత్రం

ప్రపంచ పటంలో భారత్ అసలు సైజు ఇదే!

మెర్కేటర్ మ్యాప్‌తో మారిన ప్రపంచ చిత్రం



- 3లో...

మన చిన్నప్పటి నుంచీ గోడపై చూసిన ప్రపంచ పటం నిజంగా ప్రపంచం అంతేనా? భారత్ ఎంత పెద్ద దేశమో మనకు తెలుసు.. కానీ ప్రపంచ పటంలో చూస్తే ఆ పరిమాణం అంతగా కనిపించదు. కారణం దేశం చిన్నది కావడం కాదు.. భూమి గుండ్రంగా ఉండగా దాన్ని చదునైన పటంగా మార్చడంలో జరిగే భౌగోళిక వక్రీకరణ. ముఖ్యంగా మెర్కేటర్ మ్యాప్ ధ్రువాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాలను భారీగా చూపించింది. దీంతో గ్రీన్‌లాండ్ ఆఫ్రికాతో సమానంగా కనిపించే పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి ఆఫ్రికా గ్రీన్‌లాండ్ కంటే దాదాపు 14 రెట్లు పెద్దది. ఇప్పుడు ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్ ప్రపంచ భూభాగాల అసలు పరిమాణాన్ని మరింత స్పష్టంగా చూపించేందుకు ముందుకొస్తోంది. దీంతో భారత్ కూడా మనం ఇంతకాలం చూసిన దానికంటే కొంత పెద్దగా కనిపించనుంది.



- 2లో...

## పోలీసుపై చర్య ఏది?

### డీజీపీని ప్రశ్నించిన కవిత

మహిళలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అసభ్య వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లో మీడియాతో మాట్లాడుతూ తనపై అసభ్యంగా వ్యాఖ్యలు చేసిన పోలీసు అధికారిని కేవలం సస్పెండ్ చేయడం సరిపోదని, ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని డీజీపీని కోరారు. మహిళల గౌరవాన్ని కాపాడేందుకు చట్టాలు ఉన్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం వల్ల సామాన్య మహిళలకు రక్షణపై అనుమానాలు తలెత్తుతున్నాయని అన్నారు. తనలాంటి ప్రజాజీవితంలో ఉన్న మహిళకే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

# రేవంత్ కు కేసీఆర్ సవాల్

## తిట్టించుకునేందుకు రావాలి

## అసెంబ్లీ హాజరుపై ఫుల్ క్లారిటీ



బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. అలాంటి భాష ఉపయోగించే వ్యక్తి తనను అసెంబ్లీకి వచ్చి చర్చించాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. "బూతులు మాట్లాడేవారితో చర్చించేందుకు నేను అసెంబ్లీకి రావాలా..? వద్దా..? మీరే చెప్పండి" అంటూ పార్టీ నేతల ముందు ప్రశ్నించారు. తనను అసెంబ్లీకి రావాలని కోరుతూ కాంగ్రెస్ నేతలు ధర్నాలు చేయడం వెనుక రాజకీయ ఉద్దేశం ఉందని కేసీఆర్ అభిప్రాయపడ్డారు.

**'తెలంగాణ రైజింగ్ కాదు'**

కాంగ్రెస్ పాలనపై కేసీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. "ఇది థర్డ్ క్లాస్ పాలన.. తెలంగాణ రైజింగ్ కాదు.. ఫాలింగ్ కనిపిస్తోంది" అంటూ ప్రభుత్వ పనితీరుపై ధ్వజమెత్తారు. తన చావు కోరుతూ పదేపదే ప్రసంగాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**లక్ష మందితో ప్రాజెక్టుల వద్దకు**

కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిపారు. లక్ష మందితో కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల వద్దకు వెళ్లి పరిస్థితులను ప్రజలకు చూపిద్దాం అని పిలుపునిచ్చారు. సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ భారీ ఉద్యమానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు సంకేతం ఇచ్చారు. అసెంబ్లీ వేదిక కంటే ప్రజాక్షేత్రంలోనే ప్రభుత్వాన్ని నిలదీసే పోరాటం కీలకమని కేసీఆర్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# అసెంబ్లీ తర్వాత కేసీఆర్ రణం




## జలాల కోసం ప్రత్యక్ష పోరాటం

## కార్యాచరణ వెల్లడించిన హరీశ్

అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల వ్యూహంపై ఎర్రవల్లిలో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ఎల్పీ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా కేసీఆర్ నాయకత్వంలో లక్షలాది మందితో ప్రత్యక్ష ఉద్యమం చేపడతామని ప్రకటిం చారు. కాళేశ్వరం వద్ద నీళ్లున్నా ఎత్తిపోతలు చేయడం లేదని, కేసీఆర్ హయాంలో 80 శాతం పూర్తయిన పాల మూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో మిగిలిన పనులు పూర్తి చేస్తే 60 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని పేర్కొ న్నారు. ఈ రెండు ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం రైతుల ను ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు.

**30 లక్షల విద్యార్థుల కోసం పోరాటం**

ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు కనీసం నెల రోజుల పాటు అసెంబ్లీ నిర్వహించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేయనుందని హరీశ్ రావు తెలిపారు. 22ఏ కింద వ్యవసాయ భూములను నిషేధిత జాబితాలో చేర్చడం, విద్యుత్ కోతలు, రుణమాఫీ, పాలిటెక్నిక్ జీవో 97, సింగరేణి అంశాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ వంటి సమస్యలను సభలో లేవనెత్తుతామని చెప్పారు. ముఖ్యంగా 30 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సభను స్తంభింపజేసినా పోరాడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రేవంత్ రెడ్డి కొత్త రాజకీయాలకు తెరతీశారని విమర్శించారు.

**సభకు కేసీఆర్ దూరం**

అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి వాడుతున్న భాషపై హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. అలాంటి భాషతో సభ గౌరవం దెబ్బతింటోందని, కేసీఆర్ వంటి మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత అక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిర్ణయించారని చెప్పారు. కేసీఆర్ భద్రతపై ప్రశ్నిస్తున్న రేవంత్ రెడ్డి తన సోదరుడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను ఏర్పాటు చేసి రూ.40 కోట్లు ఎలా ఖర్చు చేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు వంటి నేతలు సభను బహిష్కరించి ప్రజల్లోకి వెళ్లి తిరిగి అధికారంలోకి వచ్చిన ఉదాహరణలను ప్రస్తావించారు. కేసీఆర్ కూడా అదే బాటలో ప్రజాక్షేత్రంలోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలతోనే సమాధానం చెబుతారని హరీశ్ రావు అన్నారు.




## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు ఉభయ సభలు కొలువుదీరగా, ప్రశ్నోత్తరాలతో కార్యకలాపాలు మొదలవుతాయి. సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సభలో కీలక నివేదికలు, పలు బిల్లులు, ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం ఉంది. తెలంగాణ సమగ్ర శిక్ష 2024--25, పీఎం శ్రీ 2024--25 ఆడిట్ నివేదికలతో పాటు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు సంబంధించిన ఐదు వార్షిక నివేదికలను ప్రభుత్వం సభ ముందుకు తీసుకురానుంది. రైతులు, ఉద్యోగులు, సాగునీరు, ప్రభుత్వ పథకాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వం కూడా విపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు వ్యూహం సిద్ధం చేసుకుంది. దీంతో ఈసారి సమావేశాలు వాడీవేడిగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సభలోపల, బయట ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. సభ్యులు కోరిన సమాచారాన్ని త్వరగా అందించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శాఖల అధికారులు సమావేశాల సమయంలో అందుబాటులో ఉండాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. సభ్యులకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో అవసరమైన సమాచారాన్ని ముందుగానే అందించాలని ఆదేశించారు. ధర్నాలు, రాస్తారోకోలకు అవకాశం లేకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో అసెంబ్లీ సమావేశాలు తెలంగాణ రాజకీయాల్లో వేడి పెంచేలా సాగనున్నాయి.

## కాంగ్రెస్‌లో క్రమశిక్షణ షోకాజ్ నోటీసుల కలకలం



టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ కాంగ్రెస్‌కు నష్టం కలిగించేలా వ్యవహరించారన్న ఆరోపణలపై పలువురు నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆదిలాబాద్ ఇన్‌ఛార్జ్ కంది శ్రీనివాస్, సం జీవరెడ్డి, జూపల్లి మల్లారెడ్డి, గజ్వేల్ నర్సారెడ్డికి నోటీసులు ఇచ్చినట్లు కమిటీ ఛైర్మన్ మల్లు రవి తెలిపారు. పార్టీ లైన్ దాటి ఎవరూ వ్యవహరించొద్దని, ఎంతటి నేతలైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తాను తప్పు చేసినా ఏఐసీసీకి ఫిర్యాదు చేయవచ్చని, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేయడం తన డిక్షనరీలోనే లేదన్నారు. ఇదే సమయంలో మాజీ మంత్రి కొండా సురేఖ, సీనియర్ నేత చిన్నారెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని రవి స్పష్టం చేశారు. కక్ష సాధింపుతో ఎవరిపైనా నివేదిక ఇవ్వలేదని, వారిద్దరూ తన మిత్రులేనని చెప్పారు. క్రమశిక్షణ విషయంలో కఠినంగా ఉండా లని పార్టీ ఆదేశించిందని తెలిపారు. కార్యకర్తలు, నేతలు తమ సమ స్యలను గాంధీభవన్‌లో నేరుగా చెప్పుకోవచ్చన్నారు. మరోవైపు నకిరేకల్ సభకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరుకావడం మంచి పరిణామమని మల్లు రవి పేర్కొన్నారు.

## ఫోక్ సింగర్ ఆత్మహత్యాయత్నం

**పెళ్లి హామీతో మోసం చేశాడని ఆరోపణ**



హైదరాబాద్‌లో ఫోక్ సింగర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం ఘటన కలకలం రేపింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మాధురి తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లారు. అప్పటికే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకునే ప్రయత్నంలో ఉన్న ఆమెను గుర్తించి వెంటనే అడ్డుకున్నారు. అనంతరం చికిత్స కోసం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు తర్వాత వెలుగులోకి వచ్చాయి. తోటి ఫోక్ సింగర్ ఈశ్వర్ సాయి తనను పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి మోసం చేశాడని మాధురి ఆరోపించింది. పెళ్లి విషయంలో జరిగిన పరిణామాలు తనను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశాయని ఆమె పేర్కొన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈశ్వర్ సాయిపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ తన ఫిర్యాదుపై చర్యలు తీసుకోలేదని మాధురి తెలిపారు. ఈ పరిణామాలే తన తీవ్ర ఆవేదనకు కారణమైనట్లు తెలుస్తోంది.



## పోలీసుపై చర్య ఏది?

**డీజీపీని ప్రశ్నించిన కవిత**

మహిళలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అసభ్య వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లో మీడియాతో మాట్లాడుతూ తనపై అసభ్యంగా వ్యాఖ్యలు చేసిన పోలీసు అధికారిని కేవలం సస్పెండ్ చేయడం సరిపోదని, ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని డీజీపీని కోరారు. మహిళల గౌరవాన్ని కాపాడేందుకు చట్టాలు ఉన్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం వల్ల సామాన్య మహిళలకు రక్షణపై అనుమానాలు తలెత్తుతున్నాయని అన్నారు. తనలాంటి ప్రజాజీవితంలో ఉన్న మహిళకే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన చట్టాలను డీజీపీ పరిశీలించాలని సూచించారు. తనపై వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికల వరకు తీసుకెళ్తానని హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాల్లో హేట్ స్పీచ్‌పై బిల్లు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

**ఉద్యమకారుల హామీ అమలు చేయాలి**

తెలంగాణ ఉద్యమకారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా ఉద్యమకారులకు గుర్తింపు, బీమా, పెన్షన్ వంటి హామీలపై పురోగతి లేదని విమర్శించారు. ఉద్యమకారుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేకే కమిటీ నివేదికను ముందుకు తీసుకెళ్లాలని, ప్రభుత్వం వద్ద ఉన్న ఉద్యమకారుల వివరాలతో కనీసం కొంతమందికైనా గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణీత కాలవ్యవధితో స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీజు నియంత్రణ, ఉద్యమకారుల సమస్యలపై చట్టాలు చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ వైఖరిపైనా విమర్శలు చేసిన కవిత, కేంద్ర కులగణనలో ప్రత్యేక కులం కాలమ్ ఉండాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే ఉద్యమకారులతో కలిసి ప్రజాక్షేత్రంలో మరింత తీవ్ర పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

# తెలంగాణలో ఈవీ ఛార్జింగ్ దూకుడు

## 369 స్టేషన్లకు టీజీ రెడ్కో టెండర్లు






తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి భారీ ఊతమిచ్చేలా 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు టీజీ రెడ్కో టెండర్లు జారీ చేసింది. హైదరాబాద్ పరిధిలో 200, టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో 169 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌లోని 200 స్టేషన్లను ఆరు క్లస్టర్లుగా అభివృద్ధి చేసి, ఎంపికైన ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లు 10 ఏళ్లపాటు నిర్వహణ, అప్‌గ్రేడేషన్, వాణిజ్య కార్యకలాపాలు చేపట్టాలి. మరో 169 స్టేషన్లకు సర్వే, డిజైన్, సరఫరా, సివిల్ పనులు, ఇన్‌స్టాలేషన్, టెస్టింగ్, కమిషనింగ్‌తో పాటు 10 ఏళ్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. అర్హులైన బిడ్డర్లకు పీఎం ఈ-డ్రైవ్ నిబంధనల ప్రకారం సబ్సిడీ అందే అవకాశం ఉంది. రెండు ప్రాజెక్టుల్లో యూనిట్ ఛార్జింగ్ టారిఫ్ రూ.13 ప్లస్ జీఎస్టీగా నిర్ణయించారు. హైదరాబాద్ ప్రాజెక్టులో ఛార్జర్లకు కనీసం 95 శాతం అప్‌టైమ్ ఉండేలా నిబంధనలు రూపొందించారు.

**ప్రైవేట్ రంగానికి భారీ అవకాశాలు**

జాతీయ రహదారులు, ప్రధాన రవాణా మార్గాలతో తెలంగాణ ఈవీ రంగంలో పెట్టుబడులకు అనుకూల మార్కెట్‌గా మారుతోందని టీజీ రెడ్కో వీసీ, ఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు నుంచి ఆపరేషన్, నిర్వహణ, బ్యాటరీ సేవలు, ఈవీ ఫ్లీట్ నిర్వహణ, డిజిటల్ ఛార్జింగ్ ప్లాట్‌ఫార్మ్‌ల వరకు విస్తృత వ్యాపార అవకాశాలు ఉన్నాయని వివరించారు. పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాలకు అనుగుణంగా పబ్లిక్ ఛార్జింగ్ వ్యవస్థను విస్తరించడమే లక్ష్యమన్నారు. 169 స్టేషన్ల ప్రాజెక్టుకు సెప్టెంబర్ 7న ఉదయం 11.30 గంటలకు, 200 స్టేషన్ల ప్రాజెక్టుకు ఉదయం 11 గంటలకు ప్రీ-బిడ్ సమావేశాలు జరగనున్నాయి. సెప్టెంబర్ 8 నుంచి 22 వరకు బిడ్లను తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా సమర్పించవచ్చు. అందుబాటు ధరలో ఛార్జింగ్ సేవలతో పాటు ప్రైవేట్ ఆపరేటర్లకు దీర్ఘకాలిక వ్యాపార అవకాశాలు కల్పించేలా ప్రాజెక్టులను రూపొందించారు.




# హైదరాబాదీలకు గుడ్ న్యూస్

## మెట్రో-ఆర్టీసీ జాయింట్ పాస్

హైదరాబాద్ నగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం కీలక సౌకర్యం అందించేందుకు సిద్ధమవుతోంది. మెట్రో రైల్, టీజీఎస్ఆర్టీసీ బస్సులకు ఒకే జాయింట్ పాస్ తీసుకొచ్చే దిశగా చర్యలు వేగం పుంజుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదివారం హైదరాబాద్ మెట్రో రైల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై ఈ అంశంపై సమీక్షించారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని రోజువారీ, నెలవారీ జాయింట్ పాస్‌లు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం మెట్రో, ఆర్టీసీ ప్రయాణానికి వేర్వేరు టికెట్లు, పాస్‌లు తీసుకోవాల్సి వస్తుండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్త విధానం అమల్లోకి వస్తే ఒకే పాస్‌తో మెట్రో రైల్ నుంచి ఆర్టీసీ బస్సుకు, బస్సు నుంచి మెట్రోకు సులభంగా మారే అవకాశం ఉంటుంది. దీనివల్ల నగర ప్రజలకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు ప్రజా రవాణా వినియోగం పెరిగే అవకాశం ఉంది.

**ఓల్డ్‌సిటీ మెట్రోపై స్పీడ్**

సీఎస్ సంజయ్ జాజు ఓల్డ్‌సిటీ మెట్రో కారిడార్ రోడ్డు విస్తరణ పనుల ప్రస్తుత పరిస్థితిని కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. 7.5 కిలోమీటర్ల ఓల్డ్‌సిటీ మెట్రో కారిడార్‌కు జనరల్ కన్సల్టెంట్ నియామకం కోసం జరుగుతున్న టెండర్ ప్రక్రియపై అధికారులు వివరాలు అందించారు. పనులను వేగవంతం చేసి మెట్రో ప్రాజెక్టు కార్యకలాపాలు వీలైనంత త్వరగా ప్రారంభించాలని జాజు ఆదేశించారు. మరోవైపు ఎల్అండ్‌టీ హైదరా బాద్ మెట్రో రైల్, టీజీఎస్ఆర్టీసీ అధికారులు జాయిం ట్ పాస్ జారీకి తాము సాంకేతికంగా సిద్ధంగా ఉన్నా మని స్పష్టం చేశారు. అమలుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. దీంతో జాయింట్ పాస్ ఫేర్ నిర్మాణాన్ని త్వరగా ఖరారు చేసి, పాస్ విధానాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని సీఎస్ ఆదేశించారు. ప్రయాణికులకు మెట్రో-ఆర్టీసీ అనుసం ధానం మరింత సులభం కానుంది.

## ఫీజు బకాయిలపై నేడు బీజేపీ విద్యార్థి పోరు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం నేడు తెలంగాణలో విద్యార్థి ఆందోళనకు బీజేపీ పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్ల బకాయిలను విడుదల చేయకపోవడంతో సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతోందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం ధర్నా చౌక్‌లో నిర్వహించాలనుకున్న 'విద్యార్థి మహాధర్నా'కు అనుమతి ఇవ్వలేదని పేర్కొంటూ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతులను అణిచివేసే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. బకాయిలు వెంటనే విడుదల చేయాలి, విద్యార్థులకు న్యాయం చేయాలి అంటూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పార్టీ నాయకులు కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశం మరోసారి రాజకీయంగా వేడెక్కుతున్న వేళ అసెంబ్లీ సమావేశాల ప్రారంభ రోజున జరగనున్న ఈ కార్యక్రమంపై ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది, ఆందోళన ఏ రూపం దాల్చుతుంది అనేది కీలకంగా మారింది.



# కాంగ్రెస్ పాలన అట్టర్ ఫ్లాప్

## ఎర్రవల్లి బీఆర్ఎస్ఎల్పీలో కేసీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అంటూ మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశానికి కేటీఆర్, హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలతో కేసీఆర్ చర్చించారు. పార్టీ కార్యాచరణపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ పతనం ఖాయమని గ్రహించే అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. పాలన చేతకాకే సీఎం రేవంత్‌రెడ్డి అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న వారితో చర్చించేందుకు అసెంబ్లీకి రావాలా అంటూ ప్రశ్నించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల అంశాన్ని అసెంబ్లీలో ప్రధానంగా లేవనెత్తాలని కేసీఆర్ బీఆర్ఎస్ సభ్యులను ఆదేశించారు. రైతులకు ఉద్దేశపూర్వకంగా సాగునీరు అందించడం లేదని, రాజకీయ కారణాలతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రాజెక్టుల పంపులు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల వద్దకు బీఆర్ఎస్ నేతలు వెళ్లాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుందని కేసీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీ, మండలి సమావేశాల్లో ప్రభుత్వంపై మరింత గట్టిగా పోరాడాలని స్పష్టం చేశారు.

**ప్రజా సమస్యలే బీఆర్ఎస్ అజెండా**

అసెంబ్లీ సమావేశాలకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పనిసరిగా హాజరై ప్రతి చర్చలో చురుగ్గా పాల్గొనాలని కేసీఆర్ సూచించారు.




సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆదేశించారు. స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలపై కూడా గళం వినిపించాలని చెప్పారు. సమావేశాల్లో తన గురించి వ్యక్తిగతంగా మాట్లాడే ప్రయత్నాలు జరిగినా వాటిని పట్టించుకోవద్దని పార్టీ సభ్యులకు సూచించారు. అసెంబ్లీలో ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండాగా ఉండాలని కేసీఆర్ స్పష్టం చేశారు.





# ఢిల్లీలో కుప్పకూలిన భవనం

## ఘటనలో నలుగురు మృతి

### శిథిలాల కింద మరికొందరు?

ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ విషాదం చోటుచేసుకుంది. ఆరు అంతస్తుల భవనం కుప్పకూలడంతో నలుగురు మృతి చెందగా, పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటివరకు తొమ్మిది మందిని సురక్షితంగా బయటకు తీసినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌కు సమీపంలోని ఈ ప్రాంతంలో విద్యార్థులు ఎక్కువగా ఉంటారు. కూలిపోయిన భవనం 75 పడకల పేయింగ్ గెస్ట్ వసతి గృహంగా కొనసాగుతోంది. ప్రమాదం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో జరిగింది. స్థానికుల ప్రకారం భవనంలో సుమారు 50 మంది విద్యార్థులు ఉండే అవకాశం ఉంది. ఆదివారం కావడంతో ఎక్కువ మంది తమ గదుల్లోనే ఉన్నారని చెబుతున్నారు. శిథిలాల కింద నుంచి కేకలు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

**బేస్‌మెంట్ పనులే కారణమా?**

ప్రమాద సమాచారం అందిన వెంటనే ఢిల్లీ పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది, డీడీఎంఏ బృందాలు రంగంలోకి దిగాయి. 12కు పైగా ఫైర్ టెండర్లు, ఎక్స్‌కవేటర్, అంబులెన్సులతో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. భారీ కాంక్రీట్ శ్లాబులు, ఇనుప గర్డర్లను తొలగిస్తూ ప్రాణాల కోసం గాలిస్తున్నారు. స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవనం 40-50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో పాటు పైగా ఐదు అంతస్తులు ఉన్నాయి. బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్న సమయంలోనే భవనం కూలిపోయింది. ముందు జాగ్రత్తగా పక్క భవనాన్ని ఖాళీ చేయించారు. ముఖ్యమంత్రి రేఖా గుప్తా సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు కూడా అధికారులను సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే భవనాల నిర్మాణ నాణ్యత, అధికారుల నిర్లక్ష్యంపై ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ ఆరోపణలు చేశారు. ప్రమాదానికి అసలు కారణమేంటన్న దానిపై దర్యాప్తు కీలకంగా మారింది.

# 2029 పీఎం రేసులో రాహుల్

## విపక్ష కూటమి ప్రధాని ఆయనే

### తమిళనాడు పీసీసీ చీఫ్ స్పష్టీకరణ





2029 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తమిళనాడు కాంగ్రెస్ కీలక ప్రకటన చేసింది. విపక్షాల నేతృత్వంలోని కూటమి తరపున కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీనే ప్రధాని అభ్యర్థిగా నిలబెడతామని తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు బి. మాణిక్కం ఠాగూర్ స్పష్టం చేశారు. చెన్నైలోని సత్యమూర్తి భవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. రాహుల్ గాంధీ అభ్యర్థిత్వంపై కూటమిలో స్పష్టత ఉందని అన్నారు. “2029లో రాహుల్ గాంధీ ప్రధాని అభ్యర్థి. ఇందులో ఎలాంటి సందేహం లేదు” అని పేర్కొన్నారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ కూడా దీనిపై స్పష్టమైన వైఖరితో ఉన్నారని, మంత్రులకూ ఇదే అభిప్రాయం ఉందని ఠాగూర్ చెప్పారు. రాహుల్ అభ్యర్థిత్వంపై కూటమిలో గందరగోళం లేదని, కొంతమంది మీడియా సంస్థలే భిన్నమైన ఊహాగానాలు చేస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

**సెప్టెంబర్ 9న కూటమి పేరు**

తమిళనాడు రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రకటనతో 2029 ఎన్నికల కూటమి సమీకరణాలపై చర్చ మొదలైంది. ముఖ్యంగా టీవీకే నేతృత్వంలో ఏర్పడనున్న కూటమి రాజకీయంగా ఏ దిశలో సాగనుందన్న అంశంపై ఆసక్తి పెరిగింది. టీవీకే నేతృత్వంలోని కూటమి పేరును సెప్టెంబర్ 9న అధికారికంగా ప్రకటించనున్నట్లు మాణిక్కం ఠాగూర్ వెల్లడించారు. రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ముందుకు తీసుకురావాలన్న కాంగ్రెస్ ప్రకటన నేపథ్యంలో తమిళనాడులోని మిత్రపక్షాల వైఖరి కూడా ప్రాధాన్యత సంతరించుకోనుంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ.. ఇప్పటి నుంచే ప్రధాని అభ్యర్థిత్వంపై ప్రకటన చేయడం ద్వారా విపక్ష కూటమి రాజకీయ దిశను ముందుగానే స్పష్టం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# కేసీఆర్ అసెంబ్లీకి రావాలి

## వెయ్యి రోజులుగా దూరం.. మంత్రి శ్రీధర్‌బాబు ఫైర్



మాజీ సీఎం కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన కేసీఆర్.. వెయ్యి రోజులుగా తన బాధ్యతలను నిర్వర్తించకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కాకపోవడంపై ప్రశ్నిస్తూ టీపీసీసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన మహా ధర్నాలో శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధిగా అసెంబ్లీకి రావడం కేసీఆర్ బాధ్యత అని స్పష్టం చేశారు. ఆ బాధ్యతను నిర్వర్తించలేని పరిస్థితి ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతగా సభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలని సూచించారు.

**బీఆర్ఎస్ ప్రచారాన్ని తిప్పికొడతాం**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన అనేక హామీలను అమలు చేసిందని శ్రీధర్‌బాబు తెలిపారు. పదేళ్ల పాలనలో అన్ని వర్గాలను మోసం చేసిన బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఆ విష ప్రచారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ధీటుగా ఎదుర్కొంటుందని స్పష్టం చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఆయన లేవనెత్తే ప్రతి అంశానికి ప్రభుత్వం సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. కేసీఆర్ సలహాలు, సూచనలు స్వీకరించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇప్పటికైనా కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై తన బాధ్యతలు నిర్వర్తించాలని శ్రీధర్‌బాబు కోరారు. ప్రజా సమస్యలపై చర్చ జరిగే వేదికగా అసెంబ్లీని ఉపయోగించుకోవాలని సూచించారు.

# భారత్-బంగ్లా బంధంపై హసీనా హాట్ కామెంట్స్

## ఒక్క ప్రెస్‌మీట్‌తో సంబంధాలు దెబ్బతింటాయా?



భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తన రాజకీయ కార్యకలాపాలపై వస్తున్న విమర్శలకు ఘాటుగా స్పందించారు. భారత్‌లో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించడం, అవామీ లీగ్ నేతలు, పార్టీ కార్యకర్తలను కలవడం వల్ల భారత్-బంగ్లాదేశ్ సంబంధాలు ఎలా దెబ్బతింటాయని ప్రశ్నించారు. “నేను అంత శక్తివంతురాలిని కాదు.. నా ఒక్క ప్రెస్‌మీట్‌తో రెండు దేశాల సంబంధాలు దెబ్బతింటాయా?” అని ఆమె వ్యాఖ్యానించారు. తనకు స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఉందని, ప్రజలకు నిజాలు చెప్పడమే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. 2024 ఆగస్టు 5న దేశం విడిచి భారత్‌కు రావడం తన నిర్ణయం కాదని, పరిస్థితుల కారణంగానే భద్రత కోసం తనను భారత్‌కు తీసుకొచ్చారని తెలిపారు. భారత్ తనకు ఆశ్రయం కల్పించి భద్రత కల్పించినందుకు కృతజ్ఞతలు చెప్పారు. బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లాలన్న తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని హసీనా స్పష్టం చేశారు.

**అవామీ లీగ్‌పై నిషేధం ఎత్తేయాలని డిమాండ్**

తనపై హత్య కేసులో మరణశిక్ష విధించినా.. బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నానని హసీనా తెలిపారు. తన పార్టీ అవామీ లీగ్‌పై నిషేధం ఎత్తివేయాలని, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని, తప్పుడు కేసులను ఉపసంహరించాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. దేశంలో స్వేచ్ఛా భావ ప్రకటన దెబ్బతిందని, మీడియా సంస్థలపై దాడులు జరిగాయని, జర్నలిస్టులపై కేసులు నమోదయ్యాయని ఆమె ఆరోపించారు. 2024లో జరిగిన హింసకు తనను వ్యక్తిగతంగా బాధ్యురాలిగా చేయడాన్ని కూడా ఆమె తిరస్కరించారు. పోలీసులు తమ విధి ప్రకారం పరిస్థితులను ఎదుర్కొన్నారని, ప్రతి చర్యకు ప్రధానమంత్రిని సంప్రదించడం సాధ్యం కాదని అన్నారు. తన పార్టీకి చెందిన వేలాది మంది కార్యకర్తలు హత్యలు, అరెస్టులు, వేధింపులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. అవామీ లీగ్‌కు ఎవరు నాయకత్వం వహించాలన్నది పార్టీ రాజ్యాంగ ప్రకారం పార్టీ నిర్ణయిస్తుందని, తాను పదవి నుంచి తప్పుకోవడానికి సిద్ధమే కానీ.. పార్టీ నాయకత్వాన్ని బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్ణయించలేదని చెప్పారు. 2024లో జరిగిన విద్యార్థి ఉద్యమం కేవలం కోటా వ్యవస్థకు వ్యతిరేక నిరసన కాదని, తన ప్రభుత్వాన్ని కూల్చడమే లక్ష్యంగా సాగిందని హసీనా ఆరోపించారు.

# గ్రామ నిధులు నేరుగా సర్పంచ్‌లకే

## త్వరలో కొత్త బిల్లు: మంత్రి సీతక్క



హైదరాబాద్ గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, బ్రహ్మకుమారీస్ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి విభాగం సంయుక్తంగా నిర్వహించిన ‘సమర్థ నాయకత్వంతో పల్లె ప్రగతి’ సెమినార్‌లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కేవలం నిధులతో సాధ్యం కాదని, విలువలతో కూడిన సమర్థ నాయకత్వం అవసరమని ఆమె స్పష్టం చేశారు. సర్పంచులు ప్రజాసేవలో చిత్తశుద్ధి, నైతిక విలువలు పాటిస్తూ పల్లెలను స్వావలంబన దిశగా నడిపించాలని సూచించారు. నిత్యం ఎదురయ్యే ఒత్తిళ్లు, విమర్శలను తట్టుకుని మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని చెప్పారు. ఉపసర్పంచుల చెక్ పవర్‌కు సంబంధించి గత ప్రభుత్వ చట్టంలో ఉన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. గ్రామాల అభివృద్ధి నిధులు ఆగకుండా, నిధులు నేరుగా సర్పంచులకు అందేలా త్వరలో అసెంబ్లీలో కొత్త బిల్లు తీసుకొస్తామని వెల్లడించారు. కేంద్రం సూచించిన తొమ్మిది ఆదర్శ గ్రామ అంశాలను అమలు చేయాలని కోరారు. సర్పంచుల మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే శిక్షణ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. నిస్వార్థ ప్రజాసేవే సర్పంచుల ప్రధాన లక్ష్యం కావాలని బ్రహ్మకుమారి సంతోష్ దీదీ సూచించారు.

# హైదరాబాద్‌లో కోడిపందేలు

## స్థావరంపై పోలీసుల మెరుపు దాడి



హైదరాబాద్ శివార్లలో కోడిపందేల స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేసి భారీగా నగదు, పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడలో పాత పౌల్ట్రీ ఫామ్‌లో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్, ఆదిభట్ల పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. పోలీసులను గమనించిన కొందరు పరారవగా, పట్టుబడిన 22 మందిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి రూ.3.60 లక్షల నగదు, 31 పందెం కోళ్లు, 146 కోడి కత్తులు, 20 సెల్‌ఫోన్లు, స్కోర్ నోట్‌బుక్ స్వాధీనం చేసుకున్నారు. పందేలకు వినియోగించిన మూడు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఇతర ప్రాంతాల నుంచి బెట్టింగ్‌దారులను రప్పించి పందేలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు గుర్తించారు. స్థావర నిర్వాహకుడు, భూమి యజమాని పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రపంచ పటంలో భారత్ అసలు సైజు ఇదే!

## మెర్కేటర్ మ్యాప్‌తో మారిన ప్రపంచ చిత్రం



చిన్నప్పటి నుంచి మనం చూసిన ప్రపంచ పటం నిజమైన భూభాగ పరిమాణాలను పూర్తిగా చూపించదు. భూమి గుండ్రంగా ఉండగా.. దాన్ని చదునైన పటంగా చూపించాల్సి రావడంతో కొన్ని ప్రాంతాల పరిమాణాల్లో తేడాలు వస్తాయి. ముఖ్యంగా 1569లో ఫ్లెమిష్ కార్టోగ్రాఫర్ గెరార్డ్ మెర్కేటర్ రూపొందించిన మెర్కేటర్ ప్రొజెక్షన్ నావిగేషన్ కోసం ఉపయోగకరంగా ఉన్నా.. దేశాల అసలు పరిమాణాలను వక్రీకరిస్తుంది. ఉత్తర, దక్షిణ ధ్రువాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాలు వాస్తవం కంటే చాలా పెద్దగా కనిపిస్తాయి. అందుకే గ్రీన్‌లాండ్ ఆఫ్రికాతో దాదాపు సమానంగా కనిపిస్తుంది. కానీ వాస్తవంలో ఆఫ్రికా గ్రీన్‌లాండ్ కంటే దాదాపు 14 రెట్లు పెద్దది. రష్యా, కెనడా, యూరప్, ఉత్తర అమెరికా కూడా మెర్కేటర్ పటంలో ఎక్కువ పరిమాణంలో కనిపిస్తాయి. మరోవైపు భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న ఆఫ్రికా, దక్షిణ అమెరికా, భారత్ వంటి ప్రాంతాలు తమ వాస్తవ విస్తీర్ణం కంటే చిన్నగా కనిపిస్తాయి.

**భారత్ సైజు కూడా ఎక్కువే**

ఈ వక్రీకరణను తగ్గించేందుకు ఐక్యరాజ్యసమితి ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్ వైపు మార్పును సమర్థించింది. 2018లో కార్టోగ్రాఫర్ల బృందం రూపొందించిన ఈ పటం నావిగేషన్ కంటే భూభాగాల అసలు పరిమాణాలను స్పష్టంగా చూపించడంపై దృష్టి పెడుతుంది. ఈక్వల్ ఎర్త్‌లో ఆఫ్రికా మరింత పెద్దగా కనిపిస్తుంది. ఉత్తర అమెరికా, యూరప్ పరిమాణం తగ్గినట్లు కనిపిస్తాయి. దక్షిణ అమెరికా వాస్తవ పరిమాణానికి దగ్గరవుతుంది. భారత్ కూడా మెర్కేటర్ మ్యాప్‌తో పోలిస్తే కొంత పెద్దగా కనిపిస్తుంది. ఆఫ్రికన్ యూనియన్ సభ్య దేశాలు కూడా ఫిబ్రవరిలో ఈ ప్రొజెక్షన్‌ను స్వీకరించాయి. మ్యాపులు కేవలం ప్రదేశాలను గుర్తించేందుకు మాత్రమే కాకుండా ప్రపంచంలోని ప్రాంతాలపై మన అభిప్రాయాలను ప్రభావితం చేస్తాయని కెన్యా భూగోళ శాస్త్రవేత్త కియోకో ముయెండో పేర్కొన్నారు.

**పర్ఫెక్ట్ మ్యాప్ అనేదే లేదు**

అయితే ఈక్వల్ ఎర్త్ కూడా సంపూర్ణ పరిష్కారం కాదు. ఒక గుండ్రని భూమిని పూర్తిగా చదునుగా చూపించే సమయంలో పరిమాణం, ఆకారం, దూరం, దిశ అన్నింటినీ ఒకేసారి ఖచ్చితంగా చూపించడం సాధ్యం కాదు. మెర్కేటర్ మ్యాప్ దిశలు, నావిగేషన్‌కు అనుకూలంగా ఉంటుంది కానీ పరిమాణాల్లో తేడాలు చూపిస్తుంది. పీటర్స్ ప్రొజెక్షన్ భూభాగ విస్తీర్ణాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించినా ఆకారాలను మార్చేస్తుంది. ఈక్వల్ ఎర్త్ మాత్రం భూభాగాల పరిమాణాల విషయంలో మరింత సమతుల్యమైన చిత్రాన్ని అందిస్తుంది. అందుకే ప్రపంచానికి ఒకే ఒక్క ‘పర్ఫెక్ట్ మ్యాప్’ ఉండదు. ఏ ప్రొజెక్షన్ ఎంచుకున్నా ఏదో ఒక అంశంలో కొంత వక్రీకరణ తప్పదు.

# బీహార్‌లో సీబీఐకి కొత్త కళ్లెం

## దర్యాప్తుకు అనుమతి తప్పనిసరి

బీహార్ ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు అధికారాలపై కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలంటే ఇకపై ముందస్తుగా బీహార్ ప్రభుత్వ అనుమతి తీసుకోవడం తప్పనిసరి చేసింది. సెప్టెంబర్ 3న రాష్ట్ర హోం శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. దర్యాప్తు ప్రారంభించడం, సోదాలు నిర్వహించడం, విచారణ చేయడం, అరెస్టు చేయడం లేదా ఇతర చర్యలు తీసుకోవడం వంటి అంశాల్లో రాష్ట్ర అనుమతి అవసరం. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని కార్పొరేషన్లు, కంపెనీలు, బ్యాంకులు, బీహార్ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించే సంస్థలకు సంబంధించిన ఉద్యోగులపైనా ఇదే నిబంధన వర్తిస్తుంది. అయితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో సీబీఐకి ఎలాంటి ముందస్తు రాష్ట్ర అనుమతి అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల సిబ్బంది, కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష నియంత్రణలో ఉన్న ప్రైవేటు వ్యక్తులపై సీబీఐ తన అధికార పరిధిలో చర్యలు తీసుకోవచ్చని నోటిఫికేషన్ స్పష్టం చేసింది.

**కేసు వారీగా రాష్ట్రం నిర్ణయం**

1946 నాటి ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలోని సెక్షన్ 6 కింద బీహార్ గవర్నర్ ఈ సమ్మతిని జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని వ్యక్తులపై కేసుల్లో సీబీఐ ముందుగా ప్రతిపాదన పంపాలి. ఆ ప్రతిపాదనను పరిశీలించిన తర్వాత కేసు ప్రాతిపదికన దర్యాప్తుకు అనుమతి ఇవ్వాలా వద్దా అన్నది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. అవినీతి నిరోధక చట్టం, భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియమం, ఐటీ చట్టం కింద నమోదయ్యే కేసులతో పాటు సైబర్ నేరాల దర్యాప్తుకూ ఈ నిబంధన వర్తిస్తుంది. గతంలో ఉన్న నోటిఫికేషన్లను రద్దు చేస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసినట్లు హోంశాఖ తెలిపింది. ఈ నోటిఫికేషన్ ప్రతులను కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖ, సీబీఐ డైరెక్టర్, బీహార్ డీజీపీ, కేంద్ర ప్రభుత్వం, సంబంధిత శాఖలకు పంపించారు. దీంతో రాష్ట్ర పరిధిలోని అధికారులపై సీబీఐ చర్యలకు ముందు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కీలకంగా మారింది.

# బిహార్ విద్యార్థులపై కాల్పులు

## ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ ఫైర్

బిహార్‌లో పరీక్షా విధానంలో అవకతవకలు, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. సెప్టెంబర్ 3న ఢిల్లీలో బిహార్‌కు చెందిన విద్యార్థులను కలిసిన రాహుల్.. వారు ఎదుర్కొన్న పోలీసుల చర్యను ప్రస్తావిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, బిహార్ సీఎం సమ్రాట్ చౌధరిని ప్రశ్నించారు. “వారి విరిగిన ఎముకలు మానిపోతాయి.. కానీ వారి పగిలిపోయిన కలలను మీరు తిరిగి ఇవ్వగలరా?” అని నిలదీశారు. విద్యార్థులు అడిగింది కేవలం విద్య, ఉపాధి, జవాబుదారీతనం మాత్రమేనని అన్నారు. తన వద్దకు వచ్చిన విద్యార్థుల్లో ఒకరి కాలికి ఏకే-47 బుల్లెట్ తగిలి ఎముక విరిగిందని, సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలన్న అతని కల దెబ్బతిందని రాహుల్ పేర్కొన్నారు. మరో ఇద్దరు విద్యార్థుల భుజాలకు కూడా బుల్లెట్ గాయాలయ్యాయని తెలిపారు. గాయాలు మానినా.. పిల్లల్లో ఏర్పడిన భయానికి చికిత్స ఎక్కడుందని ప్రశ్నించారు.

**పేద కుటుంబాల కలలకు దెబ్బ**



విద్యార్థులు నేరస్తులు కాదని, పేద కుటుంబాల నుంచి వచ్చి చదువు, ఉద్యోగం ద్వారా తమ జీవితాలను మార్చుకోవాలని ప్రయత్నిస్తున్న యువత అని రాహుల్ అన్నారు. పారదర్శక పరీక్షా విధానం, సమాన అవకాశాలు, తమ హక్కుల కోసం వారు ఆందోళన చేశారని చెప్పారు. అలాంటి డిమాండ్లకు లాఠీలు, తుపాకీ కాల్పులు ఎందుకు అవసరమయ్యాయని ప్రశ్నించారు. పోలీసుల చర్యకు కేవలం కొందరు దిగువస్థాయి అధికారులను బాధ్యులను చేసి ప్రభుత్వం తప్పించుకోలేదని, ఇది పైస్థాయి ఆదేశాల ఫలితమా.. లేక పరిపాలనా వైఫల్యమా అనేది తేలాల్సి ఉందని అన్నారు. యువత గొంతును అణచివేసే ఏ ప్రభుత్వమైనా చివరకు ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని రాహుల్ హెచ్చరించారు. బిహార్‌లో ఆగస్టు మొదటి వారం నుంచి విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. పాట్నాలో ముఖ్యమంత్రి నివాసం వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన ఉద్యోగార్థులను పోలీసులు అడ్డుకున్నారు. సింగిల్-టైర్ ఉపాధ్యాయ పరీక్ష, పారదర్శక నియామక ప్రక్రియ కోసం విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆందోళనకు ప్రతిపక్ష నేతలు, ఆర్జేడీ వర్కింగ్ ప్రెసిడెంట్ తేజస్వీ యాదవ్ మద్దతు తెలిపారు.

# శాసనాల్లో శ్రీవారి బ్రహ్మోత్సవ వైభవం

### వెయ్యేళ్ల చరిత్రకు శాసనాలే సాక్ష్యం

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవం నేటి ఘనత ఒక్కరోజులో రూపుదిద్దుకున్నది కాదు. వెయ్యేళ్లకు పైగా సాగుతున్న ఈ ఉత్సవ సంప్రదాయానికి తిరుమల ఆలయ శాసనాలు కీలక చారిత్రక ఆధారాలుగా నిలుస్తున్నాయి. పురాణాల ప్రకారం బ్రహ్మదేవుడు శ్రీనివాసుడి కోసం నిర్వహించిన ఉత్సవం కావడంతో 'బ్రహ్మోత్సవం' పేరు వచ్చిందని చెబుతారు. శాసన ఆధారాల ప్రకారం క్రీ.శ. 966లో పల్లవ రాణి సామవై పెరుందేవి భోగ శ్రీనివాసమూర్తిని సమర్పించి, ఆభరణాలు, ఉత్సవాల నిర్వహణకు భూములు దానం చేశారు. పురట్టాసి, మార్గశిర మాసాల్లో ఉత్సవాల నిర్వహణకు ఆమె చేసిన ఏర్పాట్లు అప్పటికే తిరుమలలో ఉత్సవ సంప్రదాయం బలంగా ఉన్నట్లు తెలియ జేస్తున్నాయి. రెండు బ్రహ్మోత్సవాలతో మొదలైన ఈ పరంపర చోళులు, యాదవ రాయుల కాలంలో మరింత విస్తరించింది. 1254లో చిత్తిరై, 1300--1330 మధ్య ఆడి బ్రహ్మోత్సవాలు చేరాయి. విజయనగర కాలంలో ఉత్సవ వైభవం మరింత పెరిగి ఒక దశలో సంవత్సరానికి పది బ్రహ్మోత్సవాల వరకు నిర్వహించినట్లు శాసనాలు చెబుతున్నాయి.

### రాజుల కాలం నుంచి టీటీడీ దాకా

శ్రీకృష్ణదేవరాయల కాలంలోనూ బ్రహ్మోత్సవాలకు విశేష రాజపోషణ లభించింది. 1513లో ఆయన తన జన్మమాసమైన తైలో కొత్త బ్రహ్మోత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు శాసన ఆధారాలు ఉన్నాయి. అచ్యుతరాయల కాలంలో 1533--34లో కార్తీక బ్రహ్మోత్సవానికి సంబంధించిన ఆధారాలు కనిపిస్తాయి. 1539లో తాళ్లపాక పెద తిరుమలయ్యంగార్ ఆధ్వర్యంలో ఆణి బ్రహ్మోత్సవం ఏర్పడింది. ఇదే సమయంలో మలయప్పస్వామి ఉత్సవమూర్తిగా ప్రాచుర్యంలోకి వచ్చి, శ్రీదేవి, భూదేవి సమేతంగా వాహన సేవలు, ఇతర ఉత్సవాల సంప్రదాయం బలపడింది. 1803లో మెకంజీ సర్వేలో తిరుమలలో 28 ఉత్సవాల ప్రస్తావన కనిపిస్తుంది. 1843లో ఆలయ పరిపాలన హథీరాంజీ మఠ మహంతుల ఆధీనంలోకి వెళ్లగా.. 1933లో టీటీడీ ఏర్పాటుతో కొత్త సంస్థాగత పాలన ప్రారంభమైంది. అప్పటి నుంచి బ్రహ్మోత్సవాలు మరింత విస్తృత నిర్వహణతో కొనసాగుతున్నాయి.

### భక్తి వేడుకగా మారిన మహోత్సవం

నేటి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం నుంచి చక్రస్నానం వరకు తొమ్మిది రోజుల పాటు శ్రీవారి వైభవం కొనసాగుతుంది. ఉదయం, సాయంత్రం వాహన సేవలు, లక్షలాది భక్తుల గోవింద నామస్మరణతో సప్తగిరులు మార్మోగుతాయి. గతంలో రాజులు, రాణులు, సామంతులు, భక్తులు అందించిన దానధర్మాలు ఈ సంప్రదాయానికి బలం చేకూర్చగా.. కాలానుగుణంగా ఉత్సవాల సంఖ్య, నిర్వహణ విధానాలు మారాయి.

టీటీడీ ఏర్పాటయ్యాక వసతి, రవాణా, భద్రత, వైద్యం, అన్నప్రసాదం, సమాచార వ్యవస్థ, ప్రత్యక్ష ప్రసారాలు వంటి సేవలు కూడా బ్రహ్మోత్సవ నిర్వహణలో భాగమయ్యాయి.

అందుకే నేటి శ్రీవారి బ్రహ్మోత్సవం కేవలం ఆలయ ఉత్సవం కాదు.. శతాబ్దాల చరిత్ర, ఆగమ సంప్రదాయం, రాజపోషణ, భక్తి విశ్వాసాల సమ్మేళనంగా నిలిచిన మహోత్సవం.





## షర్మిల ఇంట పెళ్లి సందడి

ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల ఇంట పెళ్లి సందడి మొదలైంది. షర్మిల కుమార్తె అంజలి రెడ్డి వివాహ ముహూర్తం ఖరారైంది. అమెరికాలో ప్రముఖ వైద్యుడిగా ఉన్న డాక్టర్ సోమాల రఘురాం రెడ్డితో అంజలి వివాహం జరగనుంది. కర్నూలు జిల్లాకు చెందిన సోమాల సుబ్బారెడ్డి-పద్మ దంపతుల కుమారుడైన రఘురాం రెడ్డి కుటుంబం ప్రస్తుతం అమెరికాలో స్థిరపడింది. వైద్య వృత్తిలో కొనసాగుతున్న రఘురాం రెడ్డితో తన కుమార్తె వివాహాన్ని ఘనంగా నిర్వహించేందుకు షర్మిల కుటుంబం ఏర్పాట్లు చేస్తోంది. అంజలి--రఘురాం రెడ్డి వివాహ మహోత్సవానికి సంబంధించిన విషయాన్ని షర్మిల స్వయంగా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దీంతో షర్మిల అభిమానులు, కాంగ్రెస్ శ్రేణుల్లో పెళ్లి వేడుకపై ఆసక్తి నెలకొంది. రాజకీయ జీవితంలో బిజీగా ఉండే షర్మిలకు ఈ వేడుక కుటుంబపరంగా ప్రత్యేక సందర్భంగా మారనుంది. కర్నూలు మూలాలున్న రఘురాం రెడ్డి కుటుంబం అమెరికాలో స్థిరపడిన నేపథ్యంలో ఇరు కుటుంబాల బంధుత్వం ప్రాధాన్యం సంతరించుకుంది.



## ఉప్పాడకు రక్షణ కవచం

ఉప్పాడ తీర ప్రాంత ప్రజల దశాబ్దాల కల సాకారం దిశగా కీలక అడుగు పడింది. రూ.323 కోట్లతో ప్రతిపాదించిన తీర రక్షణ గోడకు డిజైన్, డీపీఆర్ పనులు ప్రారంభమయ్యాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక పర్యవేక్షణలో ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందం వారం రోజులుగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తోంది. ఐదుగురు సభ్యుల బృందం అధునాతన డ్రోన్లు, ట్రింబుల్ ఆర్980 జీఎన్ఎస్-ఎస్ ఆర్టీకే సాంకేతికతతో బీచ్ ప్రొఫైలింగ్, షోర్‌లైన్ మ్యాపింగ్, బాతిమెట్రిక్ సర్వే చేపట్టింది. సముద్రపు లోతు, సీ బెడ్ స్థాయిలు, అలల ప్రభావం, తీర కోత తీవ్రత, భూభాగ మార్పులను శాస్త్రీయంగా అధ్యయనం చేస్తోంది. సముద్ర గర్భం నుంచి తీర ప్రాంతం వరకు ఇసుక, మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు చేస్తున్నారు. ఈ అధ్యయనాల ఆధారంగా రక్షణ గోడకు అనువైన అలైన్‌మెంట్ ఖరారు చేయనున్నారు. గత నాలుగు దశాబ్దాల్లో సముద్ర కోతతో వందల ఎకరాలు, పలు గ్రామాలు కనుమరుగయ్యాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం డిజైన్, డీపీఆర్‌తో పాటు పర్యావరణ అనుమతులు త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.



## మెరుగైన సదుపాయాలే కూటమి లక్ష్యం

### చీరాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చీరాల: పట్టణంలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. చీరాల పురపాలక సంఘ పరిధిలోని 23, 26వ వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆదివారం స్థానిక ప్రజలు, కూటమి నాయకులతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. 23వ వార్డులో యానాది సంఘం, జాలమ్మ వాటర్ ట్యాంక్ సమీపంలో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. 26వ వార్డు విఠల్‌నగర్‌లోని మన్నా చర్చి వద్ద రూ.11.80 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.



## గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే..!

రుద్రంగి: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్ ఆధ్వర్యంలో పలు వార్డుల్లో పర్యటించి చెత్త పేరుకుపోయిన ప్రాంతాలు, మురుగు కాలువలను పరిశీలించారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం మాట్లాడుతూ డ్రైనేజీల్లో చెత్త, మురికి నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని, పిచ్చి మొక్కలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సర్పంచ్, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పే ప్రభుత్వం గ్రామంలోని చెత్త తొలగింపునకు నిధులు కేటాయించలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతి ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇచ్చి ట్రాక్టర్లు, డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో నిర్మించిన సీసీ రోడ్ల నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ విచారణకు డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు, హామీల అమలుపైనా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు.



### ముగ్గురికి పొన్నం సత్తయ్య
## పురస్కారాలు

వ్యవసాయం, సాహిత్యం, కళారంగాల్లో విశేష సేవలు అందించిన ఎం. కోదండరెడ్డి, వెలిచాల కొండలరావు, గొట్టె కనకవ్వలకు ఈ ఏడాది పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలు దక్కనున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య స్మారకార్థం పొన్నం సత్తయ్య ఛారిటబుల్ ట్రస్టు ఏటా ఈ అవార్డులను అందిస్తోంది. వ్యవసాయ రంగంలో సేవలకు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సాహిత్యంలో కొండలరావు, కళారంగంలో కనకవ్వను ఎంపిక చేసినట్లు ట్రస్టు ఉపాధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్ తెలిపారు. సెప్టెంబర్ 13న రవీంద్రభారతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఒక్కొక్కరికి రూ.50 వేల నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం అందించనున్నారు.

డా. పొన్నం రవిచంద్ర నేతృత్వంలోని జ్యూరీ కమిటీ ఎంపిక చేసిన జాబితాను ట్రస్టు చైర్మన్ పొన్నం ప్రభాకర్‌కు అందజేసింది. గత నాలుగేళ్లుగా సాహిత్యం, కళారంగాల్లో పలువురు ప్రముఖులకు ఈ పురస్కారాలు అందించారు. ఈ ఏడాది నుంచి వ్యవసాయ రంగాన్ని కూడా అవార్డుల పరిధిలోకి తీసుకురావడం విశేషం. రిపొన్నం సత్తయ్య ఆశయాలను కొనసాగిస్తూ సమాజానికి వివిధ రంగాల్లో సేవలు చేస్తున్న ప్రతిభావంతులను గుర్తించి గౌరవించడమే పురస్కారాల ప్రధాన ఉద్దేశ్యమని ట్రస్టు వెల్లడించింది.

### ఏదుల బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా నాగరాజు



ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో: ఏదుల బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా దొడ్ల నాగరాజు నియమితులయ్యారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ చేతుల మీదుగా నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ, జిల్లా కార్యదర్శి మానివర్ధన్ సాగర్, మండల అధ్యక్షుడు రాము యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఏదుల మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగుతూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నాగరాజు స్పష్టం చేశారు. పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని తెలిపారు.

### 50వ వసంతంలోకి
## గణపతి ఉత్సవాలు

ప్రొద్దుటూరు: ఐదు దశాబ్దాలుగా నిరంతరాయంగా కొనసాగుతున్న శ్రీ గణపతి మహోత్సవ కమిటీ శివాలయం ఆధ్వర్యంలోని వినాయక ఉత్సవాలు ఈ ఏడాది 50వ వసంతంలోకి అడుగు పెట్టాయి. 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 50 అడుగుల శివుని విగ్రహంలో 18 అడుగుల వినాయకుడిని ప్రతిష్ఠించి శివలింగ గణపతి రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



### కల్లూరులో ఘనంగా
## ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామంలోని శ్రీ సీతా సమేత శ్రీరామచంద్రస్వామి, లక్ష్మణస్వామి, ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ప్రతిష్ఠా కార్యక్రమానికి గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కల్లూరులో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమం అనంతరం ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, నంద్యాల ఆనంద్ భార్గవ్ రెడ్డి, సిద్ధారెడ్డి నాగముని రెడ్డి, పట్నం లక్ష్మణ్ కుమార్, కొండారెడ్డి పాల్గొన్నారు. గ్రామ నాయకులు నిరంజన్ రెడ్డి, నరసింహారావు, వేణుగోపాల్ యాదవ్, వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు, పెద్ద మున్నయ్య, గురు శంకర్, గురప్ప హాజరయ్యారు.

### ప్రొద్దుటూరులో రూ.12 కోట్లతో
## అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రొద్దుటూరు: పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ప్రొద్దుటూరు పురపాలక పరిధిలోని పలు వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.12 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీ కాలువల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రోడ్లు, కాలువల నిర్మాణంతో రాకపోకలు సులభతరం కావడంతో పాటు పారిశుధ్య సమస్యలు తగ్గుతాయన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



## ట్రాఫిక్‌కు చెక్.. ఎలివేటెడ్ దూకుడు

హైదరాబాద్ ట్రాఫిక్‌కు ఊరట కల్పించేలా ఎన్‌హెచ్-44, ఎస్‌హెచ్-1పై ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ల పనులకు కసరత్తు వేగమైంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదివారం ప్యారడైజ్ జంక్షన్ వద్ద ప్రాజెక్టు అలైన్‌మెంట్, కనెక్టివిటీ, భూసేకరణ, మౌలిక వసతుల అవసరాలను పరిశీలించారు. ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫార్మ్ రోడ్ వరకు ఎన్‌హెచ్-44పై, ప్యారడైజ్ నుంచి బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ మీదుగా ఓఆర్ఆర్ జంక్షన్ వరకు ఎస్‌హెచ్-1పై నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలను అధికారులు వివరించారు. ఈ కారిడార్లు అందుబాటులోకి వస్తే ఉత్తర హైదరాబాద్ నుంచి ఓఆర్ఆర్‌కు వేగవంతమైన అనుసంధానం ఏర్పడటంతో పాటు ప్రయాణ సమయం తగ్గనుంది. సికింద్రాబాద్--బొల్లారం--శామీర్‌పేట్ మార్గంలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సీఎస్ సూచించారు. భూసేకరణ, యుటిలిటీల మార్పిడి, అనుమతులు, శాఖల మధ్య సమన్వయాన్ని వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో రైలు, ప్రధాన రహదారులు, ఓఆర్ఆర్‌తో మెరుగైన అనుసంధానం కల్పించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

## డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరపాలి: రాచమల్లు



ప్రొద్దుటూరు: డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పలు జిల్లాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఒక్కో ఉద్యోగానికి రూ.20 లక్షల వరకు తీసుకున్నారనే ప్రచారంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వా లన్నారు. టెట్ పరీక్ష రాయకుండానే ఉద్యోగాలు కల్పించారనే ఆరోపణలపైనా విచారణ అవసరమన్నారు.



## ఫోటోనిక్స్‌లో తెలంగాణకు కొత్త దారి

హైదరాబాద్‌లో తెలంగాణను సిలికాన్ ఫోటోనిక్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కీలక చర్చలు జరిగాయి. నీతి ఆయోగ్ సభ్యుడు డా. వీకే సారస్వత్ ఆదివారం సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. 'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'కు దశలవారీ వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ రూపొందించడం, దాన్ని ఇండియా సెమీకండక్టర్ మిషన్-2.0తో అనుసంధానించే అంశాలపై చర్చించారు. డిజైన్ నుంచి పరిశోధన, తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్ వరకు సమగ్ర ఎకో సిస్టమ్ నిర్మించడంపై దృష్టి సారించారు. పరిశ్రమలు, విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని పెంచి పరిశోధన ఫలితాలను వాణిజ్య ఉత్పత్తులుగా మార్చే మార్గాల పైనా సమీక్షించారు. అధునాతన ఫోటోనిక్ ప్యాకేజింగ్, కో-ప్యాకేజ్డ్ ఆప్టిక్స్ వంటి భవిష్యత్ సాంకేతికతలకు తెలంగాణను కీలక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని శ్రీధర్‌బాబు వివరించారు. త్వరలో ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో భాగస్వామ్యం కావాలని సారస్వత్‌ను ఆహ్వానించారు. ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్ అడ్వైజరీ కౌన్సిల్‌కు నాయకత్వం వహించాలని కోరారు.

## స్వరాష్ట్రంలో ఉద్యోగుల గోడు

తెలంగాణ కోసం సకల జనుల సమ్మె చేసి రాష్ట్రం సాధించిన ఉద్యోగులకే స్వరాష్ట్రంలో సమస్యలు తీరడం లేదని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన ఉద్యోగుల సంకల్ప సభకు రాష్ట్రవ్యాప్తంగా భారీగా ఉద్యోగులు తరలివచ్చి హక్కుల కోసం గళమెత్తారు. జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో పెండింగ్‌లో లేని పీఆర్సీ, డీఏలు తెలంగాణలో ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీ వెంటనే అమలు చేయాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులు చెల్లించాలి, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి అన్నారు. 2004కు ముందు నోటిఫికేషన్‌తో ఉద్యోగాలు పొందిన వారికి ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం పీఆర్సీ, ఓపీఎస్, డీఏలతో పాటు మొత్తం 42 సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. జేఏసీ సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ ఉద్యోగులు సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు.





## ఓటర్ల సవరణ దరఖాస్తులు పరిష్కరించాలి

బాపట్ల, సెప్టెంబర్ 06: ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం అమృతలూరు, పెదపూడి గ్రామాల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పెదపూడి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి బీఎల్ఓలు, ఏఈఆర్ఓల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఓటరు నమోదు, సవరణ దరఖాస్తుల వివరాలను పరిశీలించారు. ఓటర్ల మ్యాపింగ్, ఫొటోల స్పష్టత, నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై అధికారులతో సమీక్షించారు. నిబంధనల ప్రకారం అందిన దరఖాస్తులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఓటర్ల నమోదు, జాబితా సవరణలో పొరపాట్లకు తావులేకుండా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు.

## బాపట్ల జిల్లాలో పోలీసుల సెర్చ్ ఆపరేషన్



బాపట్ల, సెప్టెంబర్ 06: నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా బాపట్ల జిల్లాలో పోలీసులు భారీ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్పీ ఉమా మహేశ్వర్ ఆదేశాలతో రేపల్లె టౌన్, చీరాల 2 టౌన్, కర్లపాలెం పోలీస్‌స్టేషన్ల పరిధిలో 175 మంది సిబ్బందితో ఏకకాలంలో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఇళ్లు, దుకాణాలు, పాత నేరస్తుల కదలికలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని 157 వాహనాలను, రేపల్లెలో 70, కర్లపాలెంలో38, చీరాలలో49 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, మత్తు పదార్థాల విక్ర యాలు, వినియోగంపై చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

# మినిస్టర్ ఆది శ్రీనివాస్..!?



## కొండా సురేఖ స్థానంలో జాక్ పాట్

## విస్తరణలో పాతకాపుకు గోల్డెన్ ఛాన్స్!

రాజకీయాల్లో ఎప్పుడు ఏ పరిణామం ఎవరికి కలిసొస్తుందో చెప్పడం కష్టం. ఏళ్ల తరబడి రాజకీయాల్లో ఉన్న నేతకు ఒక పదవి దక్కడం కోసం దశాబ్దాలు ఎదురుచూడాల్సి రావచ్చు. కానీ ఒక్కసారిగా మారిన రాజకీయ సమీకరణాలు అదే నేతకు ఊహించని అవకాశాన్ని తెచ్చిపెట్టవచ్చు. ఇప్పుడు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విషయంలోనూ ఇదే చర్చ జరుగుతోంది. తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆది శ్రీనివాస్ ఎన్నో రాజకీయ మలుపులు చూశారు. వివిధ రాజకీయ పార్టీల్లో కొనసాగిన ఆయనకు చాలా కాలం పాటు కాలం కలిసి రాలేదు. రాజకీయంగా ఎదగాలన్న లక్ష్యం ఉన్నా సరైన సమయంలో సరైన అవకాశం దక్కకపోవడంతో ఆయన ప్రయాణం నెమ్మదించింది. చివరకు కాంగ్రెస్‌లో చేరిన తర్వాత పరిస్థితులు మారాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వేములవాడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించడం ఆయన రాజకీయ జీవితంలో కీలక మలుపుగా మారింది. ఎమ్మెల్యేగా గెలవడమే పెద్ద సవాల్‌గా భావించిన సమయంలో ఆయనకు ప్రభుత్వ విప్ బాధ్యతలు దక్కాయి. దీంతో ప్రభుత్వంలో ఆయన పాత్ర పెరిగింది. పార్టీ వ్యవహారాల్లోనూ ఆయనకు ప్రాధాన్యత లభించింది. ఇప్పుడు ఏకంగా మంత్రి పదవి రేసులో ఆయన పేరు వినిపించడం ఆసక్తికర పరిణామంగా మారింది. ముఖ్యంగా మంత్రి కొండా సురేఖ చుట్టూ ఏర్పడిన రాజకీయ వివాదం ఈ చర్చకు కారణమవుతోంది. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమెను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయడం అనూహ్య రాజకీయాలకు కారణమైంది. ఈ నేపథ్యంలో ఆమెతో ఖాళీ అయిన స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలన్న చర్చ మొదలైంది. అక్కడే ఆది శ్రీనివాస్ పేరు తెరపైకి వచ్చింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం, ఎమ్మెల్యేగా ప్రస్తుత స్థానం, ప్రభుత్వ విప్‌గా నిర్వహిస్తున్న బాధ్యతలు, కాంగ్రెస్‌లో ఆయనకు ఉన్న ప్రాధాన్యత వంటి అంశాలు ఆయనకు అనుకూలంగా మారవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. అందుకే కొండా సురేఖ వ్యవహారం ఆది శ్రీనివాస్‌కు రాజకీయంగా అనూహ్యమైన అవకాశం తెచ్చిపెడుతుందా అన్న చర్చ తెలంగాణ కాంగ్రెస్‌లో ఆసక్తిని రేపుతోంది.

### సురేఖ స్థానంలో పాతకాపుకు గోల్డెన్ ఛాన్స్?

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించే నిర్ణయం ఒకవేళ జరిగితే, ఆ స్థానంలో ఎవరిని తీసుకోవాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానానికి కీలకంగా





మారుతుంది. సాధారణంగా మంత్రివర్గ మార్పులు కేవలం ఖాళీ అయిన స్థానాన్ని భర్తీ చేయడం వరకే పరిమితం కావు. ప్రాంతీయ సమతుల్యత, సామాజిక ప్రాతినిధ్యం, పార్టీ రాజకీయ అవసరాలు, ఎమ్మెల్యేల పనితీరు, ప్రభుత్వంలో వారి పాత్ర, భవిష్యత్ ఎన్నికల వ్యూహం వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ లెక్కల్లో ఆది శ్రీనివాస్‌కు కొన్ని అంశాలు అనుకూలంగా ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. వేములవాడ నుంచి కాంగ్రెస్ తరఫున గెలిచిన ఆయన ప్రస్తుతం ప్రభుత్వ విప్‌గా వ్యవహరిస్తున్నారు. శాసనసభ వ్యవహారాల్లో ప్రభుత్వానికి మద్దతుగా పనిచేయడంతో పాటు పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉంటున్నారనే అభిప్రాయం ఉంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఆయనకు మరో బలంగా కనిపిస్తోంది. ఎన్నో రాజకీయ ఒడిదుడుకులు ఎదుర్కొని చివరకు ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆదికి, మంత్రి పదవి దక్కే స్థాయికి పరిణామాలు రావడం రాజకీయంగా ఆసక్తికర మలుపుగా చెప్పొచ్చు. అందుకే ఆయన అనుచరుల్లో ఆశలు పెరుగుతున్నాయి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు పరిస్థితులు అనుకూలిస్తే ఆది శ్రీనివాస్‌ను పరిశీలించే అవకాశం ఉందన్న ప్రచారం మాత్రం బలపడుతోంది. కాంగ్రెస్ అధిష్ఠానం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ పరిస్థితిని ఎలా అంచనా వేస్తోంద. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మంత్రివర్గంలో ప్రాంతాల వారీగా సరైన సమతుల్యత కల్పించాల్సిన అవసరం ఉంటే, కొత్తగా కొందరికి అవకాశం కల్పించాలనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. అదే సమయంలో పార్టీకి బలమైన సామాజిక వర్గాల మద్దతు అవసరమనే రాజకీయ లెక్క కూడా ఉంటుంది. ఈ రెండు అంశాలు కలిసి వస్తే ఆది శ్రీనివాస్ పేరు మరింత బలపడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### మున్నూరు కాపు లెక్క.. ఆది శ్రీనివాస్‌కు కలిసొస్తుందా?

ఆది శ్రీనివాస్ పేరు మంత్రి పదవి రేసులో వినిపించడానికి మరో ముఖ్యమైన కారణం మున్నూరు కాపు సామాజిక వర్గానికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం అనే అంశం. తెలంగాణ రాజకీయాల్లో మున్నూరు కాపు వర్గం కీలక సామాజిక శక్తిగా ఉంది. ఎన్నికల సమయంలో ఈ వర్గం ఓట్ల ప్రాధాన్యతపై ప్రధాన పార్టీలు దృష్టి పెడుతుంటాయి. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన మంత్రి లేకపోవడం కూడా రాజకీయ చర్చకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో అదే వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇస్తే సామాజిక సమతుల్యత పరంగా కాంగ్రెస్‌కు ఒక రాజకీయ ప్రయోజనం కలగవచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు సీనియర్‌గా, రాజకీయ అనుభవం.. మరోవైపు ఎమ్మెల్యేగా గెలుపు.. ప్రభుత్వ విప్‌గా బాధ్యత.. ఇంకోవైపు మున్నూరు కాపు సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం.. ఈ నాలుగు అంశాలు ఆది శ్రీనివాస్ పేరును బలపరుస్తున్నాయని ఆయన అనుచరులు భావిస్తున్నారు. అయితే మంత్రి పదవి విషయంలో సామాజిక సమీకరణం ఒక్కటే నిర్ణయాత్మక అంశం కాదు. కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర రాజకీయ పరిస్థితిని పూర్తిగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రివర్గ మార్పులు జరిగితే ఎవరి పనితీరు ఎలా ఉంది, ఏ ప్రాంతానికి ప్రాతినిధ్యం పెంచాలి, ఏ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలి, పార్టీకి భవిష్యత్‌లో ఎవరి అవసరం ఎక్కువగా ఉంటుంది వంటి అంశాలపై లెక్కలు వేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఆది శ్రీనివాస్‌కు అవకాశం వస్తే అది అనుకోని రాజకీయ ఎదుగుదలగా నిలుస్తుంది. కొండా సురేఖ వ్యవహారం ఆయనకు వచ్చిన రాజకీయ జాక్‌పాట్‌గా మారుతుందా? లేక చివరి నిమిషంలో మరో పేరు తెరపైకి వస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికర ప్రశ్నగా మారింది. ప్రస్తుతం సురేఖపై చర్య విషయంలోనూ, మంత్రివర్గ మార్పుల విషయంలోనూ అధికారిక స్పష్టత లేదు. అందువల్ల ఆది శ్రీనివాస్ మంత్రి అవుతారని ఇప్పుడే తేల్చలేం. కానీ ఆయన పేరు చర్చలోకి రావడం మాత్రం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకప్పుడు ఎమ్మెల్యే పదవికే ఎదురుచూసిన సీనియర్ నేతకు ఇప్పుడు మంత్రి పదవి తలుపు తడుతున్న పరిస్థితి రావడం ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపుగా మారింది. చివరకు ఆ తలుపు తెరుచుకుంటుందా లేదా అన్నది సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం చేతిలో ఉంది.



# సాయిరెడ్డి మూడో ముచ్చట!

## ఎవరి కొంపకు ఎసరు?

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో రాజకీయ అధ్యాయం తెరపైకి రాబోతోంది. వైసీపీకి రాజీనామా చేసి బయటకు వచ్చిన మాజీ రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికను ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం తాను రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు సంకేతాలిచ్చిన ఆయన.. ఇప్పుడు ఆ మాటకు కార్యరూపం ఇవ్వబోతున్నారు. ఇవాళ విజయవాడలోని లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్‌లో మధ్యాహ్నం 1.15 గంటలకు నిర్వహించనున్న మీడియా సమావేశంలో పార్టీకి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించనున్నారు. పార్టీ పేరు, విధానాలు, లక్ష్యాలు, రాజకీయ దిశ, కార్యాచరణ వంటి అంశాలపై ఆయన స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. దీంతో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పెడతారన్న అంశం కేవలం మరో రాజకీయ పార్టీ ఆవిర్భావంగా చూడలేం. ఆయన గతంలో వైసీపీలో కీలక స్థానంలో ఉన్న వ్యక్తి. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సన్నిహితంగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. పార్టీ అంతర్గత వ్యవహారాలపై అవగాహన ఉంది. ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ కీలక పరిణామాలను దగ్గరగా చూసిన వ్యక్తిగా ఆయనకు ఉన్న నేపథ్యం భిన్నమైనది. అందుకే ఆయన పార్టీ పెట్టడం కంటే.. ఆ పార్టీ ఎలాంటి రాజకీయ శూన్యతను భర్తీ చేయబోతుందన్నదే అసలు ప్రశ్న.

### విజయసాయి కొత్త పార్టీ ఎటువైపు?

ఇటీవలి కాలంలో విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ ప్రశ్నకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. ఓవైపు కూటమిని, మరోవైపు వైసీపీని విమర్శించడంతోపాటు, స్థానిక బీజేపీ నేతలపైనా ఆయన విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రతి రోజూ కూటమి నిర్ణయాలను ఎక్స్ వేదిక ద్వారా ఎండగడుతున్నారు. అదే సమయంలో వైసీపై పైనా, ఆ పార్టీ అధినేతను టార్గెట్ చేస్తున్నారు. అంతే కాదు వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. వైసీపీలో సజ్జల నెంబర్ వన్ స్థానంలో ఉన్నారంటూ చేసిన వ్యాఖ్యలు కూడా ఆ పార్టీలో అంతర్గత వ్యవహారాలపై కొత్త చర్చకు తెరలేపాయి. ఇక్కడే నెల్లూరు రూరల్ టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయ వేడిని పెంచాయి. సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయి రెడ్డి మధ్య గతంలో జరిగినట్లు చెబుతున్న వివాదాన్ని ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. రాజకీయంగా ఇప్పటికే వేడెక్కిన వాతావరణంలో ఇలాంటి వ్యాఖ్యలు మరింత మంటలు రేపడం సహజమే. అయితే ఈ ఆరోపణలు, ప్రత్యా రోపణలు ఏ మేరకు వాస్తవం, ఏ మేరకు రాజకీయ వ్యూహంలో భాగం అన్నది సంబంధిత వ్యక్తుల వివరణలు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారం గానే తేలాలి. అయితే ఈ వివాదాలన్నింటికంటే ముఖ్య మైనది విజయసాయిరెడ్డి కొత్త పార్టీ రాజకీయంగా ఎటువైపు నిలబడబోతోందన్నదే. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రధానంగా రెండు రాజకీయ ధ్రువాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలో ఉంది. మరోవైపు వైసీపీ ప్రతిపక్షంగా ఉంది. ఈ రెండు శిబిరాలకు వెలుపల మూడో రాజకీయ శక్తి ఆవిర్భవిస్తే.. అది కేవలం సంఖ్య పెంచే పార్టీగా మిగులుతుందా? లేక రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే శక్తిగా ఎదుగుతుందా? అన్నదే అసలు పరీక్ష.

### కొత్త పార్టీకి రాజకీయ వ్యూహమే కీలకం

కొత్త పార్టీ పెట్టడం సులభం. కానీ కొత్త రాజకీయ స్థలం సృష్టించడం అంత సులభం కాదు. ఒక పార్టీకి పేరు పెట్టడం, జెండా ఆవిష్కరించడం, కార్యాలయం ఏర్పాటు చేయడం, మీడియా సమావేశం నిర్వహించడం ఒక దశ మాత్రమే. ప్రజల్లో విశ్వాసం సంపాదించడం మరో దశ. కార్యకర్తలను నిర్మించడం, నియోజకవర్గ స్థాయిలో నాయకత్వాన్ని తయారు చేయడం, ఎన్నికల్లో పోటీ చేయడం, ఓట్లను సాధించడం అసలు సవాలు. విజయసాయిరెడ్డి ఈ సవాళ్లను ఎలా ఎదుర్కొంటారన్నది ఆయన ప్రకటించే రాజకీయ ప్రణాళికను బట్టి తెలుస్తుంది. ముఖ్యంగా ఆయన పార్టీ ఏ అంశాలను కేంద్రంగా చేసుకుంటుందన్నది కీలకం. అవినీతి వ్యతిరేక కథా? పాలనా సంస్కరణలా? మత రాజకీయాలకు వ్యతిరేక కథా? అభివృద్ధి, ఉపాధి, పెట్టుబడులా? రైతు సమస్యలా? యువత భవిష్యత్తా? లేక ప్రస్తుత రాజకీయ పార్టీలపై అసంతృప్తిని తనవైపు తిప్పుకోవడమా? ఏ అంశాన్ని ప్రధాన అజెండాగా ఎంచుకుంటారో చూడాలి. ఎందుకంటే ఇప్పటికే ప్రతి పార్టీకి తనదైన ఓటు బ్యాంకు, సిద్ధాంతపరమైన గుర్తింపు, సామాజిక సమీకరణ ఉన్నాయి. వాటి మధ్య మరో పార్టీ తనకు ప్రత్యేకమైన స్థానం ఎలా సంపాదించుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. అంతేకాదు.. విజయసాయిరెడ్డి ఎవరికి దగ్గరగా ఉంటారు? ఎవరిని రాజకీయ ప్రత్యర్థిగా చూస్తారు? టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో సాన్నిహిత్యం పెంచుకుంటారా? వైసీపీకి ప్రత్యామ్నాయంగా నిలుస్తారా? లేక ఈ రెండు రాజకీయ ధ్రువాలకు సమదూరంలో ఉంటారా? అన్నది కూడా కీలకమే. రాజకీయాల్లో సిద్ధాంతం ఎంత ముఖ్యమో.. ఎన్నికల సమయంలో పొత్తులు, సీట్ల సర్దుబాట్లు, ఓట్ల బదిలీ కూడా అంతే ముఖ్యమైనవి. అందువల్ల ఆయన పార్టీ ప్రకటనలో రాజకీయ పొత్తులపై ఏదైనా సంకేతం వస్తుందా అన్నదానిపైనా అందరి దృష్టి ఉంటుంది.

### విజయసాయి పార్టీతో ఓట్ల లెక్కలు మారేనా..!?

మరో అంశం మరింత ఆసక్తికరం. విజయసాయిరెడ్డి పార్టీ ప్రధానంగా వైసీపీ నుంచి ఓట్లు చీల్చుకుంటుందా? లేక కూటమి ఓటు బ్యాంకుపైనా ప్రభావం చూపుతుందా? అన్నదే. ఒక కొత్త పార్టీకి స్వతంత్రంగా పెద్ద ఓటు శాతం సాధించడం కష్టమైనా.. కొన్ని నియోజకవర్గాల్లో గణనీయమైన ఓట్లను చీల్చగలిగితే మాత్రం ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా తక్కువ మెజారిటీతో గెలుపోటములు నిర్ణయించే నియోజకవర్గాల్లో మూడో పార్టీ అభ్యర్థి సాధించే ఓట్లు కీలకంగా మారవచ్చు. ఇప్పటికే రాష్ట్రంలో కూటమి, వైసీపీ మధ్య రాజకీయ పోరు తీవ్రంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక ఆధిపత్యం, నాయకత్వం, అభివృద్ధి పనులు, వ్యక్తిగత రాజకీయ వైరుధ్యాలు.. ఇలా అనేక అంశాలు రాజకీయ వేడిని పెంచుతున్నాయి. ఇలాంటి సమయంలో మూడో శక్తి రంగప్రవేశం చేస్తే రాజకీయ లెక్కలు మారే అవకాశం ఉంటుంది. అయితే ఆ మార్పు ఎంతవరకు ఉంటుందో చెప్పడం ఇప్పుడే సాధ్యం కాదు. పార్టీ నిర్మాణం, నాయకుల చేరికలు, ప్రజా స్పందన, ఎన్నికల సమయానికి ఏర్పడే రాజకీయ సమీకరణాలే దానికి సమాధానం చెబుతాయి. విజయసాయిరెడ్డి ముందున్న మరో పెద్ద సవాలు విశ్వసనీయత. వైసీపీలో ఉన్నప్పుడు ఒక రాజకీయ వైఖరిని సమర్థించిన వ్యక్తి.. పార్టీ నుంచి బయటకు వచ్చిన తర్వాత అదే వ్యవస్థపై విమర్శలు చేస్తే ప్రజలు సహజంగానే ప్రశ్నిస్తారు. నిన్నటి వరకు సమర్థించిన విషయాలపై నేడు వ్యతిరేక వైఖరి ఎందుకు తీసుకున్నారన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పాల్సి ఉంటుంది. గత రాజకీయ ప్రయాణంపై ఆత్మపరిశీలన చేయడం, తప్పులుంటే అంగీకరించడం, కొత్త రాజకీయ ప్రయాణానికి స్పష్టమైన కారణాలను ప్రజలకు వివరించడం ఆయనకు అవసరం.

### విజయసాయి మూడో శక్తి ఎవరికి నష్టం..!?



అయితే ఆయనకు ఒక ప్రయోజనం కూడా ఉంది. వైసీపీ అంతర్గత వ్యవహారాలపై ఆయనకు ఉన్న అనుభవం, ఆ పార్టీ నాయకత్వంపై ఉన్న అవగాహన, రాష్ట్ర రాజకీయాలపై ఆయనకున్న పరిచయం కొత్త పార్టీకి కొంత బలం ఇవ్వవచ్చు. కానీ రాజకీయ అనుభవం ఒక్కటే ఓట్లను తెచ్చిపెట్టదు. ప్రజల్లో కొత్త నమ్మకాన్ని నిర్మించాలి. ఆ నమ్మకం వ్యక్తిపై ఆధార పడుతుందా? లేక సిద్ధాంతంపై ఆధారపడుతుందా? అన్నదే పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. అందుకే నేడు విజయసాయిరెడ్డి చేయబోయే ప్రకటనకు సాధారణ రాజకీయ ప్రకటనకంటే ఎక్కువ ప్రాధాన్యం ఏర్పడింది. ఆయన కొత్త పార్టీకి పేరు ఏమిటన్నది ఒక ప్రశ్న మాత్రమే. ఆ పార్టీ ఎందుకు పుట్టింది? ఎవరిని లక్ష్యంగా చేసుకుంది? ఏ వర్గాలను కలుపుకోవాలను కుంటోంది? ఎలాంటి రాజకీయ ప్రత్యామ్నాయాన్ని చూపించబోతోంది? అన్న ప్రశ్నలకు ఆయన సమాధా నం ఇవ్వాల్సి ఉంటుంది. మాటలతో రాజకీయ సంచలనం సృష్టించడం ఒక ఎత్తు అయితే.. ఆ సంచలనాన్ని ఓట్లుగా మార్చడం మరో ఎత్తు. చివరికి విషయం ఒక్కటే. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు రెండు ప్రధాన శిబిరాల మధ్య పోరు సాగుతోంది. ఈ సమయంలో విజయసాయిరెడ్డి రూపంలో మూడో రాజకీయ ప్రయత్నం మొదలైతే.. అది ఎవరి లెక్కలను మార్చబోతోందన్నదే ఆసక్తికరమైన ప్రశ్న. కొత్త పార్టీ బలమైన ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందా? లేక ఎవరి ఓట్లనో చీల్చే రాజకీయ ప్రయోగంగా మిగిలిపోతుందా? ఇప్పుడే చెప్పలేం. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. రాజకీయ రంగంలోకి మూడో క్రీడాకారుడు అడుగుపెడితే.. ఇప్పటికే ఉన్న రెండు జట్లూ తమ వ్యూహాలను మార్చుకోవాల్సిందే. విజయసాయిరెడ్డి పార్టీ ఎవరి కొంప కూలుస్తుందో ఇప్పుడే చెప్పలేం. అది ఓట్ల రూపంలోనా, ఆరోపణల రూపంలోనా, కొత్త రాజకీయ సమీకరణాల రూపంలోనా అన్నది మాత్రం రానున్న ఎన్నికలే తేల్చనున్నాయి. అప్పటివరకు.. విజయ సాయిరెడ్డి కొత్త పార్టీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక ప్రశ్నార్థకమే కాదు.. ఒక రాజకీయ సస్పెన్సే.



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగకముందే కూటమి రాజకీయాల్లో సీట్ల సర్దుబాటు చిచ్చు మొదలైనట్టే కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒకరి కోసం మరొకరు త్యాగాలు చేసిన టీడీపీ, జనసేనలు ఇప్పుడు స్థానిక ఎన్నికల దగ్గరికి వచ్చేసరికి ఎవరి బలం వారిదే.. ఎవరి వాటా వారిదే అన్న లెక్కల్లోకి వెళ్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన 21 అసెంబ్లీ స్థానాలు, రెండు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసి అన్నింటినీ గెలుచుకోవడం ఇప్పుడు ఆ పార్టీ చేతిలో బలమైన రాజకీయ కార్డుగా మారింది. "అప్పుడు మేము త్యాగం చేశాం.. ఇప్పుడు త్యాగాలకు సిద్ధం కాదు" అన్న సంకేతాన్ని జనసేన నాయకత్వం ఇస్తోంది. గత ఎన్నికలతో పోలిస్తే తమ పార్టీ బలం పెరిగిందని, సంస్థాగతంగా విస్తరించిందని, స్థానిక స్థాయిలో తమకు గణనీయమైన పట్టుందని జనసేన నేతలు చెబుతున్నారు. అందుకే ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం భాగస్వామిగా ఉండటం కాకుండా.. తమ బలాన్ని ఎన్నికల ఫలితాల్లోకి మార్చుకోవాలని పట్టుదలగా ఉన్నారు. టీడీపీ మాత్రం నాలుగు దశాబ్దాలకు పైగా పార్టీ కోసం పనిచేసిన తమ నాయకులు, కార్యకర్తల రాజకీయ భవిష్యత్తును కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. దీంతో అసలు ఎన్నికల కంటే ముందే "ఎవరికి ఎంత?" అన్న పంచాయితీ కూటమి పెద్దలకు తలనొప్పిగా మారుతోంది.

# గొంగట్లో కూటమి లెక్కలు

## త్యాగాలు చేయం.. పల్లకీలు మోయం

## యాపారం బాగుంటేనే సాపారం సాగేది..!

## స్థానిక పోరులో కూటమికి సీట్ల చిచ్చు

## జనసేనకు బలపరీక్షగా స్థానిక పోరు

2024లో జనసేన తక్కువ స్థానాల్లో పోటీ చేసి వంద శాతం విజయాన్ని సాధించడం ఆ పార్టీకి అసాధారణమైన రాజకీయ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఆ విజయాన్ని ఇప్పుడు స్థానిక సంస్థల సీట్ల డిమాండ్‌కు జనసేన ఆధారంగా చూపుతోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో 21 సీట్లలో పోటీ చేసి 21 గెలవడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అదే నిష్పత్తిలో సీట్లు అడగడం ఒకటే కాదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నిక ల్లో కూటమి ఓట్ల బదిలీ, అభ్యర్థుల ఎంపిక, జగన్ వ్యతిరేకత, రాష్ట్రస్థాయి రాజకీయ సమీకరణాలు కీలకంగా పనిచేశాయి. స్థానిక ఎన్నికల్లో మాత్రం ప్రతి వార్డు, ప్రతి మున్సిపాలిటీ, ప్రతి కార్పొరేషన్‌కు ప్రత్యే కమైన లెక్క ఉంటుంది. అభ్యర్థి వ్యక్తిగత బలం, స్థానిక కుల సమీకరణాలు, ఆర్థిక సామర్థ్యం, స్థానిక సమస్య లు, ఎమ్మెల్యే ప్రభావం, పార్టీ కేడర్, వార్డు స్థాయి నెట్‌వర్క్ వంటి అంశాలే ఫలితాలను నిర్ణయిస్తాయి. అందుకే జనసేనకు రాష్ట్రవ్యాప్తంగా ఎంత బలం ఉందన్నదానికంటే.. ఏ ప్రాంతంలో వాస్తవంగా గెలిచే సామర్థ్యం ఉందన్నదే సీట్ల సర్దుబాటులో కీలకం కానుంది. ఇక్కడ జనసేన నాయకత్వం మరో అంశాన్ని ముందుకు తెస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాని నేతలు, ద్వితీయ శ్రేణి నాయకులు, పార్టీ కోసం కష్టపడిన వీర మహిళలు ఇప్పుడు స్థానిక ఎన్నికల ద్వారా తమ రాజకీయ భవిష్యత్తుకు బాట వేసుకోవాలని చూస్తున్నారు. మేయర్, జడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, జడ్పీటీసీ వంటి పదవులు వారికి కేవలం పదవులు కాదు.. పార్టీ లోపల రాజకీయ గుర్తింపు తెచ్చుకునే మెట్లు. అందుకే "పార్టీ కోసం ఇంతకాలం పనిచేశాం.. కనీసం స్థానిక ఎన్నికల్లోనైనా అవకాశం ఇవ్వాలి" అన్న డిమాండ్ ఆ పార్టీ అంతర్గతంగా బలపడుతోంది. ఈ అవకాశాలు కూడా దక్కకపోతే రాబోయే ఎన్నికల నాటికి పార్టీ కోసం పనిచేసేందుకు కేడర్ వెనుకడుగు వేసే ప్రమాదం ఉందన్న వాదన కూడా వినిపిస్తోంది. అందువల్ల జనసేనకు ఈ ఎన్నికలు కేవలం కూటమి సర్దుబాటుకు సంబంధించిన అంశం కాదు.. పార్టీని గ్రామ, పట్టణ స్థాయిలో విస్తరించుకునే కీలక అవకాశం.

## టీడీపీ జనసేన మధ్య లోకల్ వార్

ఈ నేపథ్యంలో జనసేన కీలక నేత నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సం తరించుకున్నాయి. తమకు పట్టున్న అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ఆయన ప్రకటించడం ద్వారా పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్థానిక సంస్థల సీట్ల విషయంలో చేసిన 15 శాతం ప్రస్తావనకు ఇది పరోక్ష కౌంటర్‌గా జనసేన వర్గాలు భావి స్తున్నాయి. "గతంలో మేము త్యాగం చేశాం.. ఇప్పుడు మళ్లీ త్యాగం చేసే పరిస్థితి లేదు" అన్న భావనను మనోహర్ వ్యాఖ్యలు ప్రతిబింబి స్తున్నా యని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రతి అంశం పైనా బహిరంగంగా స్పందించకపోయినా, పార్టీ ముఖ్య నేతల ప్రకటనలు చూస్తే స్థానిక ఎన్నికల విషయంలో జనసేన వెనక్కి తగ్గే ఉద్దేశంలో లేదన్న సంకేతం మాత్రం కనిపిస్తోం ది. 2024లో టీడీపీకి తిరిగి అధికారాన్ని సాధించడంలో తమ పాత్ర కీలకమని జనసైనికు లు బలంగా నమ్ముతున్నారు. కొందరు నాయకులు "టీడీపీకి మేమే ఆక్సిజన్ ఇచ్చాం" అన్న స్థాయిలో వ్యాఖ్యలు చేయడం ద్వారా తమ రాజకీయ ప్రాధాన్యతను గుర్తుచేస్తున్నారు. అయితే టీడీపీ కూడా అంతే గట్టిగా తన లెక్కను ముందుకు తెస్తోంది. నాలుగు దశాబ్దాలకు పైగా పార్టీ జెండాను మోస్తున్న నాయకులు, ఎన్టీఆర్ కాలం నుంచి పార్టీతో ఉన్న పెద్దలు, ఎన్నో ఎన్నికల్లో పనిచేసిన కేడర్, 2024లో అధికారాన్ని తిరిగి తీసుకురావడానికి శ్రమించిన ద్వితీయ శ్రేణి నాయకులు టీడీపీలో ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వారికి కూడా కీలకమే. మేయర్, మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్ వంటి పదవులపై ఏళ్లుగా ఆశలు పెట్టుకున్న నాయకులు ఉన్నారు. ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో కార్పొరేషన్లు, మున్సిపాలి టీలు మిత్రపక్షానికి ఇచ్చేస్తే తమ పార్టీ కేడర్‌ను ఎలా సముదాయించాలన్నది టీడీపీ అధిష్టానం ముందున్న ప్రశ్న. అందుకే చంద్రబాబు ఒకవైపు కూటమి ఐక్యతను కాపాడుతూ, మరోవైపు టీడీపీ సంస్థాగత ప్రయోజనాలను రక్షించాల్సిన క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నారు. చంద్రబాబు లెక్క ఒకటి.. లోకేశ్ లెక్క మరోటి అన్న చర్చ కూడా ఇదే నేపథ్యంలో వినిపిస్తోంది. చంద్రబాబు ప్రధానంగా రాష్ట్రవ్యాప్త కూటమి సమీకరణాలను చూస్తారు. ఎక్కడ మిత్ర పక్షానికి అవకాశం ఇస్తే కూటమి బలం పెరుగుతుంది? ఎక్కడ టీడీపీ పోటీ చేస్తే పార్టీ సంస్థాగత పట్టు బలపడుతుంది? ఏ నిర్ణయం 2029 ఎన్నికల కు ఉపయోగ పడుతుంది? అన్నదే ఆయన రాజకీయ గణితం. లోకేశ్ మాత్రం భవిష్యత్ టీడీపీని దృష్టిలో పెట్టుకుని యువ నాయక త్వం, స్థానిక కేడర్, బూత్ స్థాయి సంస్థాగత నిర్మాణం, నియోజ కవర్గాల వారీగా పార్టీ బలాన్ని పెంచే వ్యూహాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

### కార్పొరేషన్ లెక్కే అసలు కిక్కు

ఈ మొత్తం సీట్ల పంచాయితీలో అత్యంత కీలకంగా మారిన అంశం కార్పొరేషన్లు. రాష్ట్రంలో మొత్తం 16 మున్సిపల్ కార్పొరే షన్లు ఉండగా, వాటిలో ఐదు కీలక కార్పొరేష న్లపై జనసేన కన్నేసినట్లు రాజ కీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. విజయ వాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు, ఏలూరు కార్పొరే షన్లలో మేయర్ పదవులను జనసేన కోరే అవకాశాలు ఉన్నట్లు ప్రచా రం జరుగు తోంది. అంటే మొత్తం 16 కార్పొరేషన్లలో ఐదు.. దాదాపు 31.25 శాతం. కూటమిలో ఒక మిత్ర పక్షానికి దాదాపు మూడో వంతు కార్పొరేషన్ రాజకీయ స్థలాన్ని ఇవ్వడం చిన్న విషయం కాదు. అందుకే ఈఐదు కార్పొరేషన్ల విష యంలోనే టీడీపీ-జనసేన మధ్య అసలు బేర సారం జరిగే అవకాశం ఉంది. విజయవాడ జనసేనకు అత్యంత కీలకమైన డిమాండ్‌గా కనిపి స్తోంది. అయితే విజయవా డను టీడీపీ అంత సులభ ంగా వదులుకునే పరిస్థితి లో లేదన్నది టీడీపీ వర్గా ల వాదన. రాష్ట్ర రాజకీ య, ఆర్థిక, పరిపాలనా ప్రాధాన్యతల దృష్ట్యా విజ యవాడకు ప్రత్యేక స్థానం ఉంది. అంతేకాదు అక్కడి టీడీపీ సంస్థాగత బలం, స్థానిక నాయకుల రాజకీయ ఆశలు కూడా ఉన్నాయి. అందుకే జనసేన ఎంత ఒత్తిడి తెచ్చినా విజయవాడను టీడీపీ తన వద్దే ఉంచుకునే అవకాశం ఎక్కువగా ఉందన్న చర్చ సాగుతోంది. కాకినాడ విషయంలో మాత్రం జనసేనకు కొంత అనుకూల వాతావరణం ఉండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. స్థానికంగా జనసేనకు ఉన్న ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కార్పొరేషన్‌ను మిత్రపక్షానికి అప్పగించడం ద్వారా కూటమిలో సమతుల్యం సాధించవచ్చన్న లెక్క టీడీపీలో ఉన్నట్లు ప్రచారం. అయితే అక్కడ కూడా టీడీపీ స్థానిక నాయకత్వం అభ్యంతరాలు చెప్పే అవకాశం లేకపోలేదు. మిత్రపక్షానికి ఇవ్వడం ఒకటైతే.. స్థానిక టీడీపీ కేడర్‌ను ఎన్నికల బరిలో పూర్తిస్థాయిలో పనిచేయించేలా ఒప్పించడం మరో విషయం. తిరుపతి విషయంలో గత రాజకీయ సర్దుబాట్ల ప్రభావం కనిపించే అవకాశం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేనకు అసెంబ్లీ స్థానం ఇచ్చిన నేపథ్యంలో ఇప్పుడు మేయర్ స్థానాన్ని కూడా జనసేనకు కేటాయిస్తారా అన్నది ఆసక్తికరం. కూటమి భాగస్వామ్య ధర్మాన్ని కొనసాగించాలనుకుంటే జనసేనకు తిరుపతిలో అవకాశం ఇవ్వవచ్చు. కానీ అదే సమయంలో స్థానిక టీడీపీ నాయకత్వం తమకు కూడా రాజకీయ ప్రాతినిధ్యం కావాలని పట్టుబడితే ఇక్కడా పంచాయితీ తప్పదు.

### కార్పొరేషన్లపై కూటమిలో మొదలైన బేరసారాలు

ఒంగోలు మరింత సున్నితమైన అంశం. జనసేన ఈ కార్పొరేషన్‌పై ఆసక్తి చూపుతున్నప్పటికీ అక్కడ టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు తనదైన రాజకీయ లెక్క ఉంది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితో ఉన్న రాజకీయ పోటీ, స్థానిక సమీకరణాలు, మిత్రపక్షాల మధ్య ఉన్న సంబంధాలు వంటి అంశాలు ఒంగోలు సీటును క్లిష్టంగా మార్చుతున్నాయి. జనసేనకు మేయర్ పీఠం అప్పగిస్తే స్థానిక టీడీపీ నాయకత్వం ఏ మేరకు సహకరిస్తుంది? అన్నది కీలక ప్రశ్న. కాబట్టి ఐదు కార్పొరేషన్లలో ఒంగోలు అత్యంత సున్నితమైన బేరసారపు సీటుగా మారే అవకాశం ఉంది. ఏలూరు విషయంలో జనసేన గట్టిగా పట్టుబడుతుందన్న ప్రచా రం ఉంది. ఆ ప్రాంతంలో తమకు ఉన్న రాజకీయ బలం, పార్టీ విస్తరణకు ఉన్న అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జనసేన ఏలూరును వదులుకోవడానికి సిద్ధంగా ఉండకపోవచ్చు. టీడీపీ మాత్రం ఒకేసారి ఐదు కార్పొరేషన్లను ఇవ్వలేమన్న లెక్కతో ఇక్కడ సర్దుబాటు కోరే అవకాశం ఉంది. ఇదే సమయంలో టీడీపీ వర్గాల్లో మరో ప్రత్యామ్నాయ లెక్క కూడా వినిపిస్తోంది. జనసేన కోరుతున్న ఐదింటిలో అన్నింటినీ ఇవ్వకుండా.. కాకినాడ, విజయనగరం, తిరుపతి లేదా రాయలసీమలో మరో కార్పొరేషన్ వంటి ప్రాంతాల్లో అవకాశం ఇచ్చి సమతుల్యం చేయవచ్చన్నది ఆ లెక్క. అంటే జనసేన కోరుతున్న ఐదు స్థానాలకు బదులుగా వాస్తవ బలాన్ని పరిగణనలోకి తీసుకుని మూడు లేదా నాలుగు కీలక కార్పొరేషన్లు కేటాయించే అవకాశం ఉందన్నమాట. దీనివల్ల టీడీపీ విజయవాడ వంటి కీలక కార్పొరేషన్లను తన వద్ద ఉంచుకోవచ్చు. అదే సమయంలో జనసేనకు కూడా గౌరవప్రదమైన వాటా ఇచ్చినట్టవుతుంది. ఇక్కడే అసలు "గొంగట్లో కూటమి లెక్కలు" మొదలవుతున్నాయి. జనసేన ఐదు అడుగుతోంది. టీడీపీకి ఐదు చాలా ఎక్కువగా కనిపిస్తోంది. బీజేపీ కూడా తమ పరిస్థితి ఏమిటని అడుగుతోంది. మూడు పార్టీలూ తమ వాటా కోసం లెక్కలు వేసుకుంటే చివరికి గెలుపు కంటే ముందే భాగస్వామ్య బేరసారాలే ప్రధాన అంశంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యంగా 16 కార్పొరేషన్లలో ఐదు ఒక పార్టీకి ఇవ్వడం అంటే కేవలం మేయర్ పదవుల పంపకం కాదు. ఆయా నగరాల్లో భవిష్యత్ రాజకీయ సంస్థాగత నిర్మాణానికి కూడా పునాది వేయడం. అందుకే టీడీపీ ఆ నిర్ణయాన్ని అంత తేలిగ్గా తీసుకోదు.



### కూటమికి సీట్ల లెక్కలే అసలు పరీక్ష

అసలు కూటమి రాజకీయాల్లో గెలుపు అంటే కేవలం ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలవడం కాదు. భాగస్వాముల మధ్య సరైన వాటా నిర్ణయించడం కూడా గెలుపులో భాగమే. టీడీపీ తన పాత కేడర్‌ను కాపాడుకోవాలి. జనసేన తన బలం పెరిగిందని నిరూపించుకోవాలి. బీజేపీ తన రాజకీయ విస్తరణకు అవకాశం పొందాలి. ఈ మూడు అవసరాలను ఒకేసారి తీర్చడం అంత సులభం కాదు. ఒకరికి ఎక్కువ ఇస్తే మరొకరికి తక్కువ అవుతుంది. ఒకరిని సంతృప్తి పరిస్తే ఇంకొకరి కేడర్ అసంతృప్తి చెందుతుంది. అందుకే సీట్ల సర్దుబాటు కేవలం గణిత సమస్య కాదు.. రాజకీయ కళ. చివరికి చంద్రబాబు ముందున్న అసలు ప్రశ్న "జనసేనకు ఎన్ని కార్పొరేషన్లు ఇవ్వాలి?" అన్నది కాదు. "జనసేనకు ఎంత ఇస్తే కూటమి బలపడుతుంది.. టీడీపీకి ఎంత ఉంచితే పార్టీ కేడర్ నిలబడుతుంది.. బీజేపీకి ఎంత ఇస్తే మూడో భాగస్వామి సంతృప్తి చెందుతుంది?" అన్నదే. ఇదే సమయంలో పవన్ కల్యాణ్ కూడా జనసేనలో పెరుగుతున్న ఆశలు, అసంతృప్తులను సమన్వయం చేయాల్సి ఉంటుంది. నాదెండ్ల మనోహర్ వంటి నేతలు బహిరంగంగా తమ బలం గురించి మాట్లాడటం ఒక వ్యూహం కావచ్చు. కానీ చివరి నిర్ణయం మాత్రం కూటమి సమీకరణాలను దృష్టిలో పెట్టుకునే స్థాయిలో ఉండాలి. స్థానిక సంస్థల ఎన్నికలకు ఇంకా బరిలో అభ్యర్థులు దిగాల్సి ఉంది. కానీ కూటమిలో మాత్రం బేరసారాల బరిలో ఇప్పటికే ఆట మొదలైంది. విజయవాడ ఎవరిది? కాకినాడ ఎవరికి? తిరుపతిలో మళ్లీ జనసేనకే అవకాశం వస్తుందా? ఒంగోలులో టీడీపీ వెనక్కి తగ్గుతుందా? ఏలూరు విషయంలో ఎవరు పట్టు విడుస్తారు? విజయనగరం, రాయలసీమలో జనసేనకు ప్రత్యామ్నాయంగా ఏ కార్పొరేషన్ దక్కుతుంది? బీజేపీకి ఎక్కడ చోటు కల్పిస్తారు? ఇవన్నీ ఇంకా సమాధానం లేని ప్రశ్నలే. అందుకే ఇప్పుడు కూటమి పెద్దలు గుర్తుంచుకోవాల్సిన సామెత ఒక్కటే "యాపారం బాగుంటేనే సాపారం సాగుతుంది." ఎన్నికల ముందు సీట్ల పంచాయితీని సరిగ్గా పరిష్కరించుకోకపోతే ఎన్నికల బరిలో ప్రత్యర్థులను ఎదుర్కొనేలోపే కూటమి భాగస్వాములు పరస్పరం తలపడే పరిస్థితి రావచ్చు. జనసేన "త్యాగాలు చేయం.. పల్లకీలు మోయం" అంటోంది. టీడీపీ "మా కేడర్‌ను వదులుకోం" అంటోంది. బీజేపీ "మా వాటా ఏమిటి?" అని అడుగుతోంది. ఈ మూడు గొంతులు ఒకే స్వరంగా మారితేనే కూటమి బలం. లేకపోతే 16 కార్పొరేషన్ల లెక్కలు.. 175 నియోజకవర్గాల రాజకీయాలకు కూడా చిక్కులు తెచ్చే ప్రమాదం ఉంది. స్థానిక ఎన్నికల్లో ఎవరు మేయర్ అవుతారన్నది తర్వాతి సంగతి. ముందుగా కూటమిలో ఎవరి మాట ఎంత బలంగా వినిపిస్తుంది? ఎవరు ఎంత త్యాగం చేస్తారు? ఎవరు ఎంత పట్టు విడుస్తారు? అన్న గొంగటి లెక్క తేలాలి. ఆ లెక్క తేలితేనే కూటమి సాపారం సజావుగా సాగుతుంది.

### స్థానిక పోరుతో 2029 లెక్కలు మారతాయా?

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒకసారి ఒక పార్టీకి రాజకీయ స్థలం వదిలితే దాన్ని తిరిగి పొందడం అంత సులభం కాదు. మేయర్ పీఠం ఐదేళ్ల పదవి మాత్రమే కాదు.. ఒక నగరంలో పార్టీకి రాజకీయ కేంద్రంగా మారే అవకాశం. మేయర్ చుట్టూ నాయకత్వం పెరుగుతుంది. కార్పొరేటర్లు తయారవుతారు. వార్డు స్థాయిలో నెట్‌వర్క్ ఏర్పడుతుంది. భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలకు నాయకులు తయారవుతారు. అందుకే చంద్రబాబు తీసుకునే ప్రతి కార్పొరేషన్ నిర్ణయం 2029 రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇదే సమయంలో జనసేన కూడా ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో 21 స్థానాల్లో 21 గెలిచిన విజయాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో యథాతథంగా పునరావృతం చేయగలమన్నది ముందుగానే నిర్ణయించుకోలేం.

స్థానిక ఎన్నికల్లో పార్టీ కంటే అభ్యర్థి బలం చాలా సందర్భాల్లో కీలకం. జనసేనకు బలం ఉన్న చోట సీట్లు కోరడం సహజమే. కానీ "మాకు ఐదు కార్పొరేషన్లు కావాలి" అన్న సంఖ్య కంటే "ఈ ఐదు చోట్ల మేమెందుకు బలంగా ఉన్నాం?" అన్న వాదనతో టీడీపీని ఒప్పించడం మరింత రాజకీయంగా ప్రయోజనకరం. మరోవైపు టీడీపీ కూడా మిత్రపక్షాన్ని కేవలం సీట్లు అడుగుతున్న పార్టీగా చూడటం సరికాదు. జనసేనకు సంస్థాగతంగా ఎదగడానికి అవకాశం ఇవ్వకపోతే రాబోయే కాలంలో కూటమి అంతర్గత సమతుల్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. "ఎన్నికల సమయంలో మేము పల్లకీ మోశాం.. అధికారంలోకి వచ్చిన తర్వాత మా వంతు మాకు ఇవ్వడం లేదు" అన్న భావన జనసేన కేడర్‌లో బలపడితే అది భవిష్యత్‌లో టీడీపీ-జనసేన సంబం ధాలపై ప్రభావం చూపుతుంది.

అందుకే త్యాగాలు చేయం.. పల్లకీలు మోయం అన్న సందేశాన్ని టీడీపీ కూడా తేలిగ్గా తీసుకోకూడదు. ఇక బీజేపీ అంశం మూడో కోణం. టీడీపీ--జనసేన మధ్య సీట్ల లెక్క తేల్చేటప్పుడు బీజేపీని పూర్తిగా పక్కన పెట్టడం సాధ్యం కాదు. కేంద్రంలో అధికార భాగస్వామిగా ఉన్న బీజేపీ రాష్ట్రంలోనూ తన రాజకీయ స్థలాన్ని పెంచుకోవాల నుకుంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలు అందుకు ఒక అవకాశంగా ఆ పార్టీ చూస్తే, కూటమిలో మరో సీట్ల పంచాయితీ మొదలవుతుంది. ఏ ప్రాంతంలో బీజేపీకి పోటీ చేసే అవకాశం ఇవ్వాలి? ఎంత మేరకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించాలి? అన్నది కూడా తేలాల్సి ఉంటుంది. అంటే చివరికి సీట్ల లెక్క టీడీపీ-జనసేన మధ్య ద్వంద్వంగా ఉండకుండా.. టీడీపీ-జనసేన-బీజేపీ త్రిముఖ సమీకరణంగా మారే అవకాశం ఉంది.




**వంటింట్లో ప్రతిరోజూ కనిపించే ఉల్లి ఇప్పుడు సామాన్యుడి బడ్జెట్‌ను కుదిపేస్తోంది. కొన్ని రోజుల క్రితం కిలో రూ.40-50 మధ్య ఉన్న ఉల్లి ధరలు ఇప్పుడు పలు నగరాల్లో రూ.60 దాటాయి. కొన్ని ప్రాంతాల్లో రూ.100కు చేరువగా ఉన్నాయి. సెప్టెంబర్ 5న ఢిల్లీలో కిలో ఉల్లి రూ.58, ముంబైలో రూ.53, చెన్నైలో రూ.63, రాంచీలో రూ.40గా నమోదైంది. దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ధర రూ.50.79కు చేరింది. ఆగస్టు 28న కేంద్రం సబ్సిడీ ఉల్లి విక్రయాలు ప్రారంభించిన సమయంలో ఇదే సగటు ధర రూ.48.50 మాత్రమే. అంటే ప్రభుత్వం జోక్యం చేసుకున్న పది రోజుల్లోనూ జాతీయ సగటు ధర తగ్గకపోగా కొంత పెరిగింది. ఇదే సమయంలో సగటు హోల్‌సేల్ ధర కిలో రూ.42.79గా ఉంది. సామాన్యుడికి ధర పెరుగుతోంది.. రైతుకు మాత్రం గిట్టుబాటు ధర దక్కడం లేదు. ఇదే ఉల్లి మార్కెట్‌లోని అసలు వైరుధ్యం. ఉల్లి ధర పెరిగితే వినియోగదారుడు నష్టపోతాడు. ధర పడిపోతే రైతు నష్టపోతాడు. ఒక దశలో రైతు పొలంలో పండించిన ఉల్లికి కిలోకు కొన్ని రూపాయలు కూడా దక్కని పరిస్థితి వస్తుంది. మరో దశలో అదే ఉల్లి మార్కెట్ దాటి వినియోగదారుడి చేతికి చేరే సమయానికి భారీ ధర పలుకుతుంది. మధ్యలో జరిగే ఈ ధరల ప్రయాణంలో రైతు వాటా ఎంత? వినియోగదారుడిపై పడే భారం ఎంత? అన్న ప్రశ్నలు ఇప్పుడు మళ్లీ ముందుకు వస్తున్నాయి. ఉల్లి ధరల పెరుగుదల కేవలం మార్కెట్‌లో సరఫరా తగ్గిందనే ఒక్క మాటతో ముగిసే సమస్య కాదు. ఇది పంటల సాగు, నిల్వ వ్యవస్థ, వాతావరణం, రవాణా, వ్యాపారుల నిల్వలు, మార్కెట్ వ్యవస్థ, ప్రభుత్వ నిర్ణయాలు అన్నింటితో ముడిపడిన సంక్లిష్ట సమస్య. ఉల్లి ధరల పెరుగుదల ఎందుకు ఇంత వేగంగా జరుగుతోంది? ఉత్పత్తి తగ్గలేదని ప్రభుత్వం చెబుతున్నప్పుడు ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? రైతు పండించిన ఉల్లి వినియోగదారుడి చేతికి చేరేలోపు ధర ఎందుకు రెట్టింపవుతోంది? ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలంటే ముందుగా ఉల్లి పంట స్వభావాన్ని అర్థం చేసుకోవాలి.**

**భా**రత్‌లో ఉల్లి ఉత్పత్తి పెద్ద మొత్తంలోనే ఉంది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం 2024-25లో దేశంలో 307.67 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లి ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత ఏడాదిలో సుమారు 307.37 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి ఉంటుందని అంచనా. దేశీయంగా ఏడాదికి దాదాపు 200 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లి వినియోగం జరుగుతుంది. కాగితంపై చూస్తే ఉత్పత్తి వినియోగం కంటే ఎక్కువే. అయినా ధరలు పెరుగుతున్నాయి. కారణం ఉల్లి మార్కెట్‌లో ఉత్పత్తి పరిమాణం ఒక్కటే నిర్ణయాత్మకం కాదు. ఎప్పుడు పంట మార్కెట్‌కు వస్తుంది? ఎంతకాలం నిల్వ చేయగలం? నిల్వలో ఎంత నష్టం జరుగుతుంది? అవసరమైన సమయంలో ఎంత పరిమాణం మార్కెట్‌కు విడుదలవుతుంది? ఇవే ధరలను ప్రభావితం చేస్తాయి. దేశంలో ఉల్లి పంట ప్రధానంగా మూడు సీజన్లలో వస్తుంది. రబీ పంట మార్చి నుంచి మే మధ్య వస్తుంది. మొత్తం ఉల్లి ఉత్పత్తిలో దాదాపు 70 శాతం ఈ పంట నుంచే వస్తుంది. దీనిని నాలుగు నుంచి ఐదు నెలల వరకు నిల్వ చేయగలగడం ప్రత్యేకత. ఖరీఫ్ పంట అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య వస్తుంది. మొత్తం ఉత్పత్తిలో దాదాపు 20 శాతం దీని వాటా. అయితే ఎక్కువ కాలం నిల్వ చేయడం సాధ్యం కాదు. జనవరి నుంచి మార్చి మధ్య వచ్చే లేట్ ఖరీఫ్ పంట వాటా సుమారు 10 శాతం. ఇది ఖరీఫ్ కంటే కొంత ఎక్కువకాలం నిల్వ ఉండగలిగినా దీర్ఘకాల నిల్వకు అనుకూలం కాదు. దేశంలో నెలకు సుమారు 17 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లి వినియోగం జరుగుతుంది. ఇది దాదాపు 3.4 కోట్ల 50 కిలోల బస్తాలకు సమానం. డిమాండ్ మాత్రం ఏడాది పొడవునా దాదాపు ఒకేలా ఉంటుంది. సరఫరా మాత్రం సీజన్ ప్రకారం మారుతుంది. ముఖ్యంగా మే--జూన్ నుంచి అక్టోబర్--నవంబర్ వరకు రబీ ఉల్లి నిల్వలపైనే దేశంలోని భారీ వినియోగం ఆధారపడుతుంది. అందువల్ల రబీ పంటకు వర్షం, ఎండ, కోత సమయంలో నష్టం, నిల్వ సమస్యలు ఎదురైతే దాని ప్రభావం నెలల తర్వాత మార్కెట్‌లో కనిపిస్తుంది. ఈ ఏడాది కూడా రబీ పంట కోత సమయంలో అకాల వర్షాలు నష్టాన్ని కలిగించాయని కేంద్రం చెబుతోంది. మహారాష్ట్రలో ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలు ఉల్లి ఉత్పత్తి, నాణ్యత, నిల్వలపై ప్రభావం చూపాయని రైతులు చెబుతున్నారు. మహారాష్ట్ర దేశ ఉల్లి ఉత్పత్తిలో దాదాపు 40 శాతం వాటా కలిగి ఉంది. అక్కడ జరిగే పరిణామాలు దేశవ్యాప్తంగా ధరలపై ప్రభావం చూపుతాయి.

### ధర తగ్గిందా.. లేక మంట ఇంకా ఉందా?

ప్రభుత్వం రూ.35కే ఉల్లిని విక్రయిస్తున్నా దేశవ్యాప్తంగా ధరలు మాత్రం వెంటనే అదుపులోకి రాలేదు. కేంద్రం జోక్యంతో కొన్ని ప్రాంతాల్లో కిలోకు రూ.2--3 వరకు ధర తగ్గిందని ఎన్‌సీసీఎఫ్ చెబుతోంది. వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి కూడా బఫర్ ఉల్లి పంపిణీతో కొంత ఉపశమనం లభించిందని పేర్కొన్నారు. కానీ జాతీయ సగటు ధరను చూస్తే పరిస్థితి పూర్తిగా మారలేదు. ఆగస్టు 28న రూ.48.50గా ఉన్న సగటు రిటైల్ ధర సెప్టెంబర్ 5 నాటికి రూ.50.79కు చేరింది. చెన్నైలో రూ.63, ఢిల్లీలో రూ.58 ధర ఉండటం సామాన్యుడిపై పడుతున్న భారాన్ని స్పష్టంగా చూపిస్తోంది. అంటే ప్రభుత్వం మార్కెట్‌లోకి ఉల్లి విడుదల చేస్తోంది.. కానీ మొత్తం మార్కెట్‌ను ప్రభావితం చేసేంత పరిమాణంలో సరఫరా ఇంకా పెరగలేదు. బఫర్ స్టాక్ పరిమితంగా ఉండటం ఒక కారణం. మరోవైపు కొత్త ఖరీఫ్ పంట ఇంకా మార్కెట్‌లోకి పూర్తిగా రాలేదు. అధికారులు మాత్రం కొత్త ఖరీఫ్ పంటపై ఆశావహంగా ఉన్నారు. అక్టోబర్ మధ్య నుంచి కొత్త ఉల్లి మార్కెట్‌కు రావడం ప్రారంభమవుతుందని అంచనా వేస్తున్నారు. సరఫరా పెరిగితే ధరలపై ఒత్తిడి తగ్గవచ్చు. లాసల్‌గావ్ ఏపీఎంసీ దేశంలోనే అతిపెద్ద ఉల్లి మార్కెట్లలో ఒకటి. అక్కడి నిపుణుల అభిప్రాయం ప్రకారం గత నాలుగు--ఐదు నెలల్లో ఉల్లి ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. మార్కెట్‌కు వస్తున్న పరిమాణం ప్రస్తుతం తక్కువగా ఉండటంతో మరో కొన్ని వారాలు ధరలు అధికంగా ఉండే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. సాధారణంగా అక్టోబర్ చివరి వారాల్లో ఖరీఫ్ ఉల్లి రాక మొదలవుతుంది. దాంతో సరఫరా పెరిగి ధరలు క్రమంగా తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ఈసారి ఖరీఫ్ సాగు తగ్గినట్టు వస్తున్న అంచనాలు ధరలు ఎంత మేరకు తగ్గుతాయన్న దానిపై సందేహాలు కలిగిస్తున్నాయి. మరోవైపు రబీ ఉల్లి సాధారణంగా దీపావళి సమయానికి మార్కెట్‌లోకి వచ్చే పరిస్థితి ఉంటుంది. ఆ తర్వాత ఖరీఫ్ ఉల్లి సరఫరా పెరుగుతుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే అక్టోబర్, నవంబర్‌లో ధరలకు కొంత ఉపశమనం రావచ్చు. కానీ తక్షణ ఉపశమనం కోసం ప్రభుత్వం చేస్తున్న విక్రయాలు ఎంతకాలం కొనసాగుతాయి? బఫర్ స్టాక్ ఎంతమేర అందుబాటులో ఉంటుంది? కొత్త పంట మార్కెట్‌కు ఎంత పరిమాణంలో వస్తుంది? ఇవే కీలక ప్రశ్నలు.

### ఉల్లి ధర.. రాజకీయాలకు పాత గాయం

ఉల్లి కథ ఆర్థిక సమస్యతో ఆగిపోదు. భారత రాజకీయాల్లో ఉల్లి ధరలకు ప్రత్యేక చరిత్ర ఉంది. వంటింటి ఖర్చును నేరుగా ప్రభావితం చేసే వస్తువు కావడంతో ధర పెరిగితే దాని ప్రభావం సామాన్యుడి అసంతృప్తిపై వేగంగా కనిపిస్తుంది. గత ఐదు దశాబ్దాల్లో ఉల్లి ధరలు పలు ఎన్నికల ఫలితాలపై రాజకీయ ప్రభావం చూపిన సందర్భాలు ఉన్నాయి. 1980 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఉల్లి ధరల ప్రభావం అంతగా కనిపించడంతో ఆ ఎన్నికను 'ఉల్లి ఎన్నిక'గా కూడా అభివర్ణించారు. జనతా పార్టీ ప్రభుత్వం కూలిపోవడంలో ఉల్లి ధరల అంశం కూడా చర్చకు వచ్చింది. 1998 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కిలో ఉల్లి రూ.40-50 వరకు చేరింది. ఆ ఎన్నికల్లో బీజేపీ ఓటమి చవిచూసింది. 2013లో ఉల్లి ధరలు కిలోకు రూ.100 వరకు వెళ్లాయి. దాని తర్వాత జరిగిన 2014 లోక్‌సభ ఎన్నికల్లో పదేళ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఓడిపోయింది. ఉల్లి ధరలు పెరిగితే రాజకీయ ప్రమాదం ఎందుకు పెరుగుతుందో ఈ చరిత్ర చెబుతోంది. 2024లో కూడా ఉల్లికి కనీస మద్దతు ధర కల్పించాలంటూ ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ వెలుపల ఉల్లి దండలు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. రైతుకు గిట్టుబాటు ధర కావాలి. వినియోగదారుడికి అందుబాటు ధర కావాలి. ప్రభుత్వం ఈ రెండింటినీ సమతుల్యం చేయాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది. ఎన్నికలు లేని సమయంలో ధరల సమస్యకు రాజకీయ వేడి కొంత తక్కువగా కనిపించవచ్చు. కానీ వంటింటి ఖర్చు పెరిగినప్పుడు ప్రజల అసంతృప్తి మాత్రం ఎన్నికల క్యాలెండర్‌ను చూసి ఆగదు. ఉల్లి ధర కేవలం కూరగాయ ధర కాదు.. ఇంటి నెలవారీ బడ్జెట్‌పై పడే ప్రత్యక్ష భారం. రైతు పండించినప్పుడు ధర రాకపోవడం, వినియోగదారుడు కొనేటప్పుడు అధిక ధర చెల్లించాల్సి రావడం మధ్యలోని వ్యవస్థలో ఉన్న లోపాలను బయటపెడుతోంది. ప్రభుత్వం బఫర్ స్టాక్ పెంచాలి. నిల్వ సదుపాయాలను ఆధునికీకరించాలి. పంట కోత సమయంలో వాతావరణ నష్టాలను తగ్గించే చర్యలు తీసుకోవాలి. రైతుకు సరైన మార్కెట్ సమాచారం అందాలి. రైతు నేరుగా పెద్ద మార్కెట్లకు చేరుకునే మార్గాలు బలపడాలి. నిల్వలు దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించే అవకాశాలను కట్టడి చేయాలి. ఉల్లి ధరలు పెరిగినప్పుడే మార్కెట్‌లోకి వచ్చి తాత్కాలికంగా రూ.35కు అమ్మడం ఒక్కటే పరిష్కారం కాదు. రైతుకు గిట్టుబాటు ధర.. వినియోగదారుడికి అందుబాటు ధర.. మధ్యవర్తిత్వం తగ్గిన పారదర్శక మార్కెట్.. దీర్ఘకాలిక నిల్వ వ్యవస్థ ఇవన్నీ కలిసినప్పుడే ఉల్లి సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది. ప్రస్తుతం కేంద్రం బఫర్ ఉల్లిని 17 నగరాలకు తరలిస్తోంది. అక్టోబర్ మధ్య నుంచి కొత్త ఖరీఫ్ పంట రాకతో సరఫరా పెరుగుతుందని ఆశిస్తోంది. అప్పటివరకు ఉల్లి ధరల మంట ఎంత తగ్గుతుంది అన్నదే ఇప్పుడు సామాన్యుడి ఎదురుచూపు. ఎందుకంటే ఉల్లి ధర పెరిగిన ప్రతిసారి కన్నీళ్లు రైతు కళ్లలో మాత్రమే రావు.. చివరికి ఆ ప్రభావం సామాన్యుడి వంటింట్లో కూడా కనిపిస్తుంది.

## కిలో రూ.60 దాటింది.. సామాన్యుడికి షాక్



### రైతు పండిస్తాడు.. వ్యాపారి ధర నిర్ణయిస్తాడా?

**ఉ**ల్లి ధరల కథలో అత్యంత బాధాకరమైన అంశం రైతు పరిస్థితి. ఒక సీజన్‌లో ధరలు పడిపోతే రైతు తీవ్రంగా నష్టపోతాడు. అదే ధరల పతనం తర్వాతి సీజన్‌లో సాగు తగ్గుతుంది. ఉల్లి కొరత ఏర్పడుతుంది. ధరలు ఒక్కసారిగా పెరుగుతాయి. ధరలు పెరిగినప్పుడు రైతులు ఎక్కువగా సాగు చేయడానికి ముందుకు వస్తారు. తదుపరి సీజన్‌లో ఉల్లి సరఫరా పెరిగి ధరలు మళ్లీ పడిపోతాయి. వ్యవసాయ ఆర్థిక శాస్త్రంలో దీనిని 'కాబ్‌వెబ్ సైకిల్'గా పిలుస్తారు. రైతు గత ఏడాది ధరను చూసి ఈ ఏడాది ఎంత పంట వేయాలో నిర్ణయిస్తాడు. గత సీజన్‌లో ఉల్లి ధరలు బాగా పడిపోయాయనుకోండి. రైతు సాగు తగ్గిస్తాడు. అందరూ అదే నిర్ణయం తీసుకుంటే ఉత్పత్తి తగ్గుతుంది. మార్కెట్‌లో సరఫరా తగ్గడంతో ధరలు పెరుగుతాయి. ధరలు పెరిగిన వెంటనే రైతులు ఉల్లి సాగు పెంచుతారు. అందరూ ఒకేసారి ఎక్కువగా పండిస్తే తదుపరి దశలో సరఫరా పెరిగి ధరలు కుప్పకూలుతాయి. రైతు ఎప్పుడూ ధరల చక్రంలో చిక్కుకున్నట్టే ఉంటుంది. మరో సమస్య నిల్వ. దేశంలో ఇప్పటికీ చాలా మంది రైతులు ఆధునిక కోల్డ్ స్టోరేజీ వ్యవస్థలకు బదులుగా సంప్రదాయ పద్ధతుల్లో ఉల్లిని నిల్వ చేస్తున్నారు. గాలి ఆడే షెడ్లలో నేలపై ఉల్లిని నిల్వ చేస్తారు. కాలం గడిచే కొద్దీ ఉల్లి పాడవుతుంది. బరువు తగ్గుతుంది. వాతావరణం అనుకూలంగా లేకపోతే నష్టం మరింత పెరుగుతుంది. రైతు వద్ద పంట ఉన్న సమయంలో ధర తక్కువగా ఉంటే నిల్వ చేయాలని చూస్తాడు. కానీ నిల్వ ఖర్చు, నష్టం భరించే శక్తి లేకపోతే తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది. అక్కడి నుంచి అదే ఉల్లి అనేక చేతులు మారుతుంది. రైతుకు వచ్చిన ధరకు వినియోగదారుడు చెల్లించే ధరకు భారీ తేడా కనిపిస్తుంది. రైతు రూ.30-35కు అమ్మిన ఉల్లి వినియోగదారుడికి రూ.70-80కు చేరే పరిస్థితి ఎందుకు వస్తోంది? దీనిపై ఇప్పటికే ప్రశ్నలు వచ్చాయి. కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా చేసిన ఒక అధ్యయనంలో రైతుల నుంచి కిలోకు రూ.34కు కొనుగోలు చేసిన ఉల్లి వినియోగదారుడికి రూ.80కు అమ్మిన సందర్భం నమోదైంది. అంటే ధర పెరుగుదలలో ఉత్పత్తి స్థాయి మాత్రమే కాదు.. సరఫరా గొలుసులోని ప్రతి దశ కీలకం. వ్యాపారులు నిల్వ చేయడం, మార్కెట్‌కు సరఫరాను ఆలస్యం చేయడం, రవాణా ఖర్చులు, మార్కెట్ మార్జిన్లు, డిమాండ్--సరఫరా అంచనాలు ధరను ప్రభావితం చేస్తాయి. హోర్డింగ్, బ్లాక్ మార్కెటింగ్‌పై అనుమానాలు వచ్చిన ప్రతిసారీ సామాన్యుడి భారం పెరుగుతుంది. రైతు నుంచి వినియోగదారుడి వరకు ధరల మధ్య అంతరం తగ్గించకుండా కేవలం రైతు ఉత్పత్తి పెంచమని చెప్పడం సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు.

### రూ.35 ఉల్లి.. కేంద్రం పరుగులు ఎందుకు?

**ధరలు పెరగడంతో కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు తన బఫర్ నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేస్తోంది. 2026 కోసం కేంద్రం 1.21 లక్షల టన్నుల ఉల్లి బఫర్ స్టాక్‌ను సిద్ధం చేసింది. అయితే ధరల నియంత్రణ కోసం ఈ ఏడాది 2 లక్షల మెట్రిక్ టన్నుల రబీ ఉల్లి నిల్వ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థలు కలిసి 1.21 లక్షల టన్నులు మాత్రమే సేకరించగలిగాయి. అంటే లక్ష్యంలో దాదాపు 40 శాతం కొరత ఏర్పడింది. ఇదే సమయంలో నిల్వ ఉల్లిలో 30 శాతం వరకు పాడైందనే వార్తలు వచ్చాయి. సాధారణంగా నిల్వలో సుమారు 20 శాతం వరకు నష్టం జరుగుతుందని చెబుతారు. అయితే కేంద్ర ప్రభుత్వం అధిక స్థాయిలో నిల్వలు పాడయ్యాయన్న వార్తలను ఖండించింది. ఇప్పుడు మిగిలిన బఫర్ స్టాక్‌ను ధరలు ఎక్కువగా ఉన్న నగరాలకు తరలిస్తున్నారు. కిలో రూ.35కే ఉల్లిని విక్రయించడం కేంద్ర జోక్యంలో ప్రధాన చర్యగా మారింది. ఢిల్లీ--ఎన్‌సీఆర్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, కేరళ, రాజస్థాన్, పంజాబ్, ఒడిశా వంటి ప్రాంతాల్లో ఈ విక్రయాలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాల ఆసక్తికి అనుగుణంగా ప్రభుత్వ దుకాణాలు, మొబైల్ వాన్లు, సహకార సంఘాలు, స్థానిక సంస్థలు గుర్తించిన ఇతర కేంద్రాల ద్వారా ఉల్లి విక్రయిస్తున్నారు. కేంద్ర గిడ్డంగుల సంస్థ ఉల్లిని సార్టింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్ చేసి రాష్ట్రాలకు తరలించే బాధ్యతను నిర్వహిస్తోంది. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థలు కూడా మార్కెట్ జోక్యంలో కీలకంగా ఉన్నాయి. ఎన్‌సీసీఎఫ్ ఇప్పటివరకు 1,500 టన్నుల బఫర్ ఉల్లిని విక్రయించినట్టు సంస్థ ఎండీ అనీస్ జోసెఫ్ చంద్ర తెలిపారు. మొత్తం 17 నగరాల్లో మొదటి పది రోజుల్లో సుమారు 4,000 టన్నుల బఫర్ ఉల్లి విక్రయించినట్టు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే వెల్లడించారు. ధరలను తగ్గించేందుకు ప్రత్యేక రైలు సేవను కూడా ఉపయోగిస్తున్నారు. దీనికి 'కందా ఎక్స్‌ప్రెస్' అని పేరు పెట్టారు. నాసిక్ ప్రాంతం నుంచి ఢిల్లీ, చెన్నై, మదురై, కొచ్చి, గువాహటి వంటి ప్రధాన నగరాలకు ఉల్లిని వేగంగా తరలించేందుకు ఈ మార్గాన్ని ఉపయోగిస్తున్నారు. ఆగస్టు 28న కందా ఎక్స్‌ప్రెస్ ద్వారా 453.65 టన్నుల ఉల్లి ఢిల్లీకి చేరింది. ఆగస్టు 31న 840 టన్నుల ఉల్లి చెన్నైకి చేరింది. గువాహటికి పంపేందుకు మూడో రేక్‌ను సిద్ధం చేస్తున్నారు. రోడ్డు మార్గంలో కూడా సుమారు 1,000 టన్నుల ఉల్లిని పలు నగరాలకు తరలిస్తున్నారు. గత ఏడాది 16 నగరాలకు 86 సరుకు రైళ్ల ద్వారా 88 వేల టన్నుల ఉల్లిని తరలించారు. 2024లో 14 సరుకు రైళ్ల ద్వారా సుమారు 12 వేల టన్నులు తరలించారు. అంటే ప్రభుత్వం ఈసారి సరఫరా వ్యవస్థను వేగవంతం చేయడానికి ప్రయత్నిస్తోంది.**



# ఈస్ట్ జోన్ దూకుడు..
# సౌత్ జోన్ విలవిల

## ఇషాన్ శతకం.. ఈస్ట్‌దే పూర్తి ఆధిపత్యం



చెన్నైలో దులీప్ ట్రోఫీ ఫైనల్ తొలి రోజు ఈస్ట్ జోన్ బ్యాటింగ్ దూకుడు ముందు సౌత్ జోన్ బౌలింగ్ తేలిపోయింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ మెరుపు వేగంతో శతకం బాది ఇన్నింగ్స్‌ను ముందుండి నడిపించగా, కుమార్ కుశాగ్ర అర్ధశతకంతో అతడికి అద్భుతమైన సహకారం అందించాడు. టాస్ తర్వాత బ్యాట్ అందుకున్న ఈస్ట్ జోన్‌కు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 44 పరుగులతో తుఫాను ఆరంభం ఇచ్చాడు. అతడి దూకుడుకు తోడైన అభిమన్యు ఈశ్వరన్ 72 పరుగులతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. నంబర్-3లో వచ్చిన శిఖర్ మోహన్ 85 పరుగులతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ తన క్లాస్ చూపిస్తూ బౌండరీలతో స్కోర్ వేగాన్ని పెంచాడు. చివరి సెషన్‌లో కుశాగ్రతో కలిసి సౌత్ జోన్ బౌలర్లపై ఒత్తిడి పెంచిన ఇషాన్, సెంచరీ మార్క్ దాటి 111 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కుశాగ్ర 63 పరుగులతో క్రీజులో ఉన్నాడు. 79 ఓవర్లు ముగిసేసరికి ఈస్ట్ జోన్ 385/4తో పటిష్ట స్థితిలో నిలిచింది. చామా మిలింద్ రెండు వికెట్లు తీసినా, సౌత్ జోన్ ప్రధాన పేసర్ మహ్మద్ సిరాజ్ వికెట్ లేకుండానే ముగించడం ఆ జట్టు కష్టాలను మరింత పెంచింది. తొలి రోజే మ్యాచ్‌పై పట్టు బిగించిన ఈస్ట్ జోన్, ఇప్పుడు భారీ స్కోర్ దిశగా దూసుకెళ్తోంది.



# తబాహీకి క్రికెట్ దిగ్గజం ప్రశంస

## ప్రపంచం దృష్టిని ఆకర్షించిన బిట్టూ

### 21 ఏళ్ల కుర్రాడేం చేశాడంటే!?

బ్యాట్‌తో బంతిని బౌండరీకి తరలించే క్రికెట్ దిగ్గజం కెవిన్ పీటర్సన్.. ఈసారి ఒక యువకుడి సేవా స్ఫూర్తిని ప్రపంచానికి పరిచయం చేశాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన 21 ఏళ్ల బీఎస్సీ విద్యార్థి బిట్టూ తబాహీ, అసలు పేరు సురేంద్ర సింగ్ చౌదరి, కాలుష్యంతో కుప్పకూలిన అజ్నార్ నదిని శుభ్రం చేసేందుకు ఒంటరిగా రంగంలోకి దిగాడు. జనవరి 26, 2026న ఆలయం సమీపంలో పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్త, బురదను తొలగించడం మొదలు పెట్టాడు. చేతికి గ్లౌజులు లేవు.. కాళ్లకు బూట్లు లేవు.. ఈత కూడా రాదు. అయినా వెనక్కి తగ్గలేదు. స్నేహితులతో కలిసి డబ్బులు పోగుచేసి పనిముట్లు, చెత్త బుట్టలు కొనుగోలు చేశాడు. సుమారు రూ.30 వేల వరకు ఖర్చు పెట్టాడు. చేతులకు ఇన్ఫెక్షన్ వచ్చినా శుభ్రత యజ్ఞాన్ని ఆపలేదు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పీటర్సన్ స్పందించాడు. "తబాహీ" అంటే విధ్వంసం అని గుర్తుచేస్తూ.. కాలుష్యాన్ని విధ్వంసం చేస్తున్నాడంటూ అతడిని హీరోగా అభివర్ణించాడు. అంతర్జాతీయ గుర్తింపు రావాలని కోరుకున్నాడు. మరోవైపు 'ది ఓషన్ క్లీనప్' వ్యవస్థాపకుడు బోయన్ స్లాట్ కూడా బిట్టూ ప్రయత్నాన్ని గుర్తించి తన సంస్థలో పనిచేసే అవకాశం ఇచ్చాడు. దీంతో ఓ చిన్న నది కోసం మొదలైన పోరాటం.. ఇప్పుడు ప్రపంచ వేదికపై మారుమోగుతోంది.




# సిరాజ్‌పై సూర్యవంశీ సిక్సర్ల సునామీ

### 15 ఏళ్ల వయసులోనే టెస్ట్ కలలకు బాటలు

చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన 2026 దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ బ్యాట్ ఒక్కసారిగా మెరుపు వేగం అందుకుంది. ఈస్ట్ జోన్ తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఈ యువ సంచలనం, టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను టార్గెట్ చేసి ఆడిన తీరు మ్యాచ్‌కు హైలైట్‌గా నిలిచింది. ఏడో ఓవర్‌లో సిరాజ్ వేసిన బంతులను పాయింట్ మీదుగా బౌండరీకి తరలించి, లాంగ్ ఆఫ్ మీదుగా సిక్సర్ బాదిన సూర్యవంశీ, మిడ్ ఆఫ్ మీదుగా మరో ఫోర్ కొట్టి ఏకంగా 14 పరుగులు రాబట్టాడు. దీంతో సిరాజ్ తన తొలి స్పెల్‌లో ఐదు ఓవర్లకు 41 పరుగులు ఇచ్చినా వికెట్ దక్కించుకోలేకపోయాడు. సూర్యవంశీ దూకుడుతో సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ పవర్‌ప్లే ముగిసేలోపే బౌండరీల వద్ద ఐదుగురు ఫీల్డర్లను మోహరించాల్సి వచ్చింది. 37 బంతుల్లో 44 పరుగులతో ఔటైనా, ఈ ఇన్నింగ్స్ అతడి ప్రతిభకు మరో స్టాంప్ వేసింది. 15 ఏళ్ల వయసులోనే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఇలాంటి ధైర్యం చూపించడం అతడి టెస్ట్ ఆశలకు కొత్త ఊపునిచ్చింది. సరైన శిక్షణ, స్థిరమైన ప్రదర్శన కొనసాగితే భారత్ టెస్ట్ క్రికెట్‌లో మరో సెహ్వాగ్ తరహా విధ్వంసక ఓపెనర్‌గా ఎదిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# స్లెడ్జింగ్‌లోనూ నవ్వులే నవ్వులు

### తిలక్ మాటకు నవ్విన సూర్యవంశీ

### మైదానంలో ఆసక్తికర సీన్

**దు**లీప్ ట్రోఫీ ఫైనల్‌లో బ్యాట్‌తో బౌలర్లకు చుక్కలు చూపించిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ, మైదానంలో జరిగిన ఓ సరదా స్లెడ్జింగ్‌తో మరోసారి వార్తల్లో నిలిచాడు. సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ, వైభవ్‌ను ఉద్దేశించి "క్యా యార్.. యే వైస్ కెప్టెన్?" అంటూ సరదాగా స్లెడ్జింగ్ చేయడం కెమెరాలకు చిక్కింది. అయితే ఈ మాటల యుద్ధం ఎక్కువసేపు సాగలేదు. ఇద్దరూ కాసేపటికే నవ్వుకోవడంతో సీన్ కాస్త కూల్ అయిపోయింది. కానీ సోషల్ మీడియాలో మాత్రం దీనిపై చర్చ మొదలైంది. 15 ఏళ్ల ఆటగాడిపై ఇలాంటి వ్యాఖ్యలు అవసరమా అంటూ కొందరు అభిమానులు తిలక్ తీరును ప్రశ్నించారు. మరోవైపు మ్యాచ్‌లో వైభవ్ ఆడిన దూకుడు మాత్రం అసలు హైలైట్. టీమిండియా పేసర్ మహ్మద్ సిరాజ్‌పై నిర్భయంగా షాట్లు ఆడిన అతడు 37 బంతుల్లో 44 పరుగులు కొట్టాడు. ఐదు ఫోర్లు, ఒక సిక్సర్‌తో స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించాడు. అర్ధశతకానికి ఆరు పరుగుల దూరంలో చామా మిలింద్ బౌలింగ్‌లో ఔటైనా, తన మార్క్ చూపించాడు. సెమీఫైనల్లో 57 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టి దులీప్ ట్రోఫీలో అతి పిన్న వయస్కుడైన హాఫ్ సెంచరీ వీరుడిగా నిలిచిన వైభవ్, ఫైనల్‌లోనూ తన దూకుడుతో అందరి చూపులను తనవైపు తిప్పుకున్నాడు.



Movie Announcement

# మోక్షజ్ఞ ఎంట్రీ.. వశిష్ఠతో మాస్ మిషన్!

### స్టార్‌లా కాదు.. నందమూరి స్టైల్లో జర్నీ

**నం**దమూరి వారసుడి వెండితెర ఎంట్రీకి రంగం సిద్ధమైంది.. బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞను హీరోగా పరిచయం చేస్తూ దర్శకుడు వశిష్ఠ కొత్త చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. బింబిసార, విశ్వంభర వంటి చిత్రాలతో తనదైన మార్క్ చూపించిన వశిష్ఠ.. మోక్షజ్ఞను ఏ రేంజ్‌లో ప్రజెంట్ చేయబోతున్నారన్న ఆసక్తి నందమూరి అభిమానుల్లో మొదలైంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ భారీ స్థాయిలో నిర్మించనుంది. ఇప్పటికే బాలకృష్ణ, మోక్షజ్ఞను దర్శకుడు వశిష్ఠ కలిసిన ఫొటోలు బయటకు రావడంతో సినిమా ప్రకటనకు ముందే హైప్ మొదలైంది. త్వరలోనే షూటింగ్ పట్టాలెక్కనున్న ఈ సినిమాకు సంబంధించి నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను మేకర్స్ దశలవారీగా ప్రకటించనున్నారు. ఓవైపు బాలకృష్ణ నటిస్తున్న చీదీఖ111 మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు 'దాదా' అనే టైటిల్‌ను ఖరారు చేయడంతో.. అటు బాలయ్య.. ఇటు మోక్షజ్ఞ.. వరుస ప్రాజెక్టులతో నందమూరి అభిమానులకు ఇక పండగే!



# ముంబైలో దాదా మాస్ జాతర!

### గన్ పట్టి గర్జిస్తూ బాలయ్య యాక్షన్

టైటిల్ రివీల్‌తోనే మాస్ వైబ్స్ పుట్టించిన బాలయ్య.. వీరసింహారెడ్డి తర్వాత మరోసారి దర్శకుడు గోపీచంద్ మలినేనితో జతకట్టిన నందమూరి బాలకృష్ణ.. ఈసారి ముంబై బ్యాక్‌డ్రాప్‌లో దాదాగా దర్శనమివ్వబోతున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో బాలయ్యను దర్శకుడు సరికొత్త స్టైలిష్ లుక్‌లో ప్రజెంట్ చేశారు. డాకూ మహారాజ్ తర్వాత బాలయ్య ప్రెజెంటేషన్‌లో కనిపిస్తున్న కొత్తదనం ఈ టీజర్‌లోనూ స్పష్టంగా కనిపించింది. సాల్ట్ అండ్ పెప్పర్ గడ్డం, మాస్ స్వాగ్, పవర్‌ఫుల్ యాక్షన్‌తో దాదా పాత్రపై ఆసక్తి పెంచారు. "నాకు గురి పెట్టడానికి.. ఒంట్లో పొగరు, వేలికి ట్రిగ్గర్ ఉంటే సరిపోదు.. బుల్లెట్లకు బలుపు ఉండాలి, గన్స్‌కు గట్స్ ఉండాలి" అంటూ బాలయ్య చెప్పిన డైలాగ్ టీజర్‌కు హైలైట్‌గా నిలిచింది. మంచు మనోజ్, కాజల్ అగర్వాల్, సముద్రఖని, శరత్‌కుమార్, అభిమన్యు సింగ్, ఉపేంద్ర లిమాయే, మనీష్ వాధ్వా, స్వాసిక కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అరవింద్ ఎస్. కశ్యప్ విజువల్స్, తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు మరింత బలం చేకూర్చాయి. సాయి మాధవ్ బుర్రా మాటలు మరో ఆకర్షణ. వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 24న థియేటర్లలోకి రానుంది.దాదా..

# రూ.2 కోట్ల సినిమా.. రూ.100 కోట్ల వసూళ్లు!

### చిన్న బడ్జెట్.. భారీ బాక్సాఫీస్ సంచలనం

బాక్సాఫీస్‌పై పెద్దగా అంచనాలు లేకుండా నిశ్శబ్దంగా మొదలైన హనుమాన్ అంశ్ ఇప్పుడు సంచలన విజయగాథగా మారింది. కేవలం రూ.2 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ భక్తిరసభరిత బయోగ్రాఫికల్ డ్రామా.. తొలిరోజు కేవలం రూ.10 లక్షల వసూళ్లతో ప్రయాణం మొదలుపెట్టింది. థియేటర్లలో స్పందన పరిమితంగానే ఉంటుందని భావించిన ఓటీటీ సంస్థలు కూడా సినిమాపై పెద్దగా ఆసక్తి చూపలేదని సమాచారం. కానీ కథపై ప్రేక్షకుల్లో నమ్మకం పెరగడంతో మౌత్ టాక్ ఒక్కసారిగా సీన్ మార్చేసింది. రోజురోజుకూ వసూళ్లు పుంజుకుని.. డబుల్ డిజిట్‌లోకి దూసుకెళ్లిన సినిమా.. చివరకు బాక్సాఫీస్ ఫినిషింగ్ లైన్‌కు చేరువైంది. నీమ్ కరోలి బాబా జీవితాన్ని ఆధారంగా చేసుకుని డాక్టర్ విశాల్ చతుర్వేది దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం.. 30 రోజుల్లోనే సుమారు రూ.93 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అంటే ఇప్పుడు రూ.100 కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టడానికి మరో చిన్న అడుగు మాత్రమే మిగిలింది. రూ.2 కోట్ల పెట్టుబడిని వంద కోట్ల దిశగా నడిపించడం భారతీయ సినీ చరిత్రలోనే అరుదైన ఫీట్‌గా నిలవనుంది. శోభినవ్ సత్యా ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంలో ఆయన నటనకు ప్రశంసలు దక్కుతున్నాయి. సెప్టెంబర్ 11న హోంబలే ఫిల్మ్స్ ఈ సినిమాను విదేశాల్లోనూ విడుదల చేయనుంది.







# రిలీజ్ డేట్లలో ట్విస్ట్.. ఫ్యాన్స్‌లో టెన్షన్!

### ది ప్యారడైజ్, ఫౌజీ చిత్రాలపై ఉత్కంఠ

### పండగకు వస్తాయా.. వాయిదా పడతాయా?

Release Date Twist

**టా**లీవుడ్‌లో 2026 సెకండాఫ్ హిట్‌ల జోరు కొనసాగుతుండగా.. ఇప్పుడు రెండు భారీ సినిమాల రిలీజ్ డేట్లు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. నాని నటిస్తున్న ది ప్యారడైజ్, ప్రభాస్ నటిస్తున్న ఫౌజీ చిత్రాల విషయంలో అసలు రిలీజ్ ఎప్పుడు అన్నదానిపై క్లారిటీ లేకపోవడంతో అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. ది ప్యారడైజ్ మరోసారి వాయిదా పడే అవకాశాలున్నాయంటూ కొద్ది రోజులుగా ఇండస్ట్రీలో గట్టిగా ప్రచారం జరుగుతోంది. అక్టోబర్‌లో సినిమాను తీసుకొచ్చే ఆలోచనలో మేకర్స్ ఉన్నారనే టాక్ వినిపిస్తున్నా.. దీనిపై అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. ప్రస్తుతం 'యశనుగుల' పాట ప్రమోషన్స్‌లో టీమ్ బిజీగా ఉంది. మరోవైపు ప్రభాస్ ఫౌజీకి డిసెంబర్ 3, 2026 రిలీజ్ డేట్ ఇప్పటికే ప్రకటించారు. అయితే విశ్వక్‌సేన్ లెగసీ డిసెంబర్ 4న థియేటర్లలోకి రానున్నట్టు ప్రకటించడంతో.. ఫౌజీ అదే తేదీకి వస్తుందా? మారుతుందా? అన్న చర్చ మొదలైంది. ఫౌజీ టీమ్ కూడా డిసెంబర్ 3 రిలీజ్‌ను తాజాగా మరోసారి ధృవీకరించలేదు. నాని, ప్రభాస్ కెరీర్‌లో కీలకమైన ఈ రెండు ప్రాజెక్టులపై భారీ అంచనాలున్నాయి. పైగా రెండు సినిమాల కలిపి బడ్జెట్ రూ.1000 కోట్లకు పైమాటే కావడంతో.. రిలీజ్ డేట్‌పై వచ్చే ప్రతి అప్‌డేట్ ఇప్పుడు ఇండస్ట్రీకి కీలకంగా మారింది.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.